

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
17 వ వసంతంలోకి


మెదక్


సంగారెడ్డి


సిద్దిపేట

మంగళవారం 1 అక్టోబర్ 2024

### దసరాలోపు ఉమ్మడి మెదక్ జిల్లా నామినేటెడ్ పోస్టుల భర్తీకి

# సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్

### ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రిగా సత్ఫలితాలనిచ్చిన మంత్రి సురేఖ కృషి

మెదక్ మేజర్ న్యూస్ ప్రతినిధి. బీ ఉమ్మడి మెదక్ జిల్లాలో నామినేటెడ్ పోస్టుల భర్తీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ దిశగా జిల్లా ఇంచార్జ్ మంత్రివర్యులు కొండా సురేఖ ప్రయత్నాలు ఫలించాయి. మెదక్ జిల్లాలో నామినేటెడ్ పోస్టుల భర్తీ విషయమై ఈ రోజు మంత్రి సురేఖ మంత్రి దామోదర రాజనరసింహ తో కలిసి సీఎం రేవంత్ రెడ్డి తో గంటకు పైగా చర్చలు జరిపారు. పలు సమీకరణాల పై సుదీర్ఘ చర్చ అనంతరం సీఎం రేవంత్ రెడ్డి నామినేటెడ్ పోస్టుల భర్తీ పై స్పష్టతనిచ్చారు. దసరా లోపు నామినేటెడ్ పోస్టులను భర్తీ పూర్తి చేయనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి మంత్రి సురేఖకు తెలిపారు.



# బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో...



బంగారు బతుకమ్మ ఉయ్యాలో
కలవారి కోడలు ఉయ్యాలో
కలికి కామాక్షి ఉయ్యాలో
కడుగుచున్నది పప్పు ఉయ్యాలో
కడవలో పోసి ఉయ్యాలో
అప్పుడే వచ్చెను ఉయ్యాలో
ఆమె పెద్దన్న ఉయ్యాలో
కాళ్లకు నీళ్ళిచ్చి ఉయ్యాలో
కన్నీళ్లు నింపె ఉయ్యాలో

అంటూ తెలంగాణలోని పల్లెలు పట్టణాలలో ఆడపడుచుల ఆనందోత్సాహాలతో జరుపుకునే పండుగ బతుకమ్మ. ఈ నెల 2వ తేదీ నుంచి తొమ్మిది రోజులపాటు ఈ ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ప్రతిఏటా భాద్రపద అమావాస్య నుంచి వేడుకలు మొదలై ఆశ్వీయుజ శుద్ధ అష్టమి వరకు కొనసాగి దుర్గాష్టమి రోజున సద్దుల బతుకమ్మతో ముగుస్తాయి.

#### సంప్రదాయాలకు ప్రతీక


తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రత్యేకగా నిలిచే ఈ పండుగను మహిళలు విశిష్ట వేడుకగా జరుపుకుంటారు గౌరీదేవిని గౌరమ్మగా బతుకమ్మ రూపంలో ప్రత్యక్ష దైవంగా కొలుస్తారు ఇందుకోసం తంగేడు గునుగు గడ్డిపూరు గుమ్మడి కట్లెపూలు బంతి తదితర అందుబాటులో ఉండే పువ్వులన్నింటిని తెచ్చుకొని సిద్ధంగా ఉంచుకుంటారు.

ాలను ఎల్తె(వెదురు) ఈ నెలతో గానీ, సిబ్బి తీగలతో గానీ అల్లిన సిబ్బిలో లేదా తాంబాలంలో బతుకమ్మను పేరుస్తారు. కింద గుమ్మడి ఆకులను పరిచి దానిపై తంగేడు పూలు పెడతారు. వాటిపై రంగురంగుల పూలను రంగుల్లో ముంచిన గొడుగు గడ్డి పూలను వరుసగా పూల శంఖంలా తయారు చేస్తారు. అడుగు నుంచి పై వరకు పూల దొంతరల మధ్య ముద్ద పోక బంతులు రుద్రాక్షపూలతో అలంకరిస్తారు. పైన శిఖరం మీద గుమ్మడి పువ్వులోని అండాశయాన్ని గౌరమ్మగా భావించి ఉంచుతారు. దాని పక్కనే పసుపు ముద్దతో చేసిన మరో గౌరమ్మను ఉంచి పూజలు చేస్తారు . ప్రధాన కూడళ్ల వద్ద వెంపలి చెట్టు కొమ్మలు నాటి పసుపు కుంకుమలు చల్లుతారు సాయంత్రం వేళల్లో దాని చుట్టూ బతకమ్మలు ఉంచి తమతో తెచ్చుకున్న పూలను ఒక్కొక్కటిగా వేస్తూ...

"ఒక్కేసి పువ్వేసి చందమామ
ఒక్క జాము అయ్యే చందమామ
శివుడింక రాడాయే చందమామ
శివుని పూజలాయే చందమామ"...

.... అంటూ పదిసార్లు ఒక్కొక్క పువ్వు వేసి శివుని ప్రార్థిస్తారు.

వివరాలు 2లో




# విద్యతోపాటు....

## క్రీడల్లోనూ ప్రోత్సహించండి

- ఎంపీ రఘునందన్ రావు తో కలిసి ఆర్ సి పురం లో నూతన పాఠశాల భవనం ప్రారంభోత్సవం
- 40 లక్షల రూపాయల సొంత నిధులు అందజేసిన ఎమ్మెల్యే గూడెం మైపాల్ రెడ్డి



రామచంద్రాపురం మేజర్ న్యూస్ : విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంపొందించేలా ప్రోత్సహించాలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సోమవారం రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని ఎస్ఎన్ కాలనీలో మన ఊరు మనబడి పథకం ద్వారా ఒక కోటి 23 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల నూతన భవనాన్ని మెదక్ ఎంపీ రఘునందన్ రావు తో కలిసి ఎమ్మెల్యే జీఎంఆర్ ప్రారంభించారు. పాఠశాల నిర్మాణానికి జీవిఆర్ ఎంటర్ప్రైజెస్ సిఎస్ఆర్ ద్వారా 40 లక్షల రూపాయలు కేటాయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ.. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నియోజకవర్గంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాల తీర్చిదిద్దామని తెలిపారు. నియోజకవర్గ కేంద్రమైన పటాన్చెరులో కేజీ నుండి పీజీ వరకు ప్రభుత్వ భవనాల్లో విద్య రంగాన్ని అభివృద్ధి చేశామని తెలిపారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని, అదే స్థాయిలో ఫలితాలు రావాలని కోరారు. ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ.. ప్రతి పాఠశాలలో బాలికలకు స్వీయ రక్షణ పై శిక్షణ అందించాలని కోరారు. దేశ భవిష్యత్తు తరగతి గది నాలుగు గోడల మధ్య నిర్మితమవుతుందన్న స్వామి వివేకానంద సూక్తికి అనుగుణంగా ప్రతి విద్యార్థి భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పుష్ప నగేష్ యాదవ్, సింధు ఆదర్శ్ రెడ్డి, జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ సురేష్, పంచాయతీరాజ్ డి ఈ సురేష్, మండల విద్యాధికారి రాథోడ్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, పరమేష్ యాదవ్, ఐలేష్, సీనియర్ నాయకులు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





# బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో...

పాటలు పాడుతూ...

తమ స్థాయికి తగిన పట్టు పీతాంబరాలు ధరించిన మహిళలు చేతులను వెనుకకూ, ముందుకు కదిలిస్తూ ఒక లయ ప్రకారం చప్పట్లు కొడుతూ, వొంగుతూ లేస్తూ లయబద్ధంగా కుడి నుంచి ఎడమవైపు అడుగులేస్తూ బతుకమ్మ పాటలు పాడుతూ వలయాకారంగా బతుకమ్మల చుట్టూ తిరుగుతారు. తమ జీవితాల్లోని ఒడిదొడుకులనే పాటలు గా మలిచి పాడుతూ ఆడతారు. పేద, ధనిక తేడాలు మరచి అన్ని స్థాయిల వారితో ఊరు ఊరంతా కోలాహలంగా ఉంటుంది. ఏ ఆడపడుచు నోట విన్నా బతుకమ్మ పాటలే వినిపిస్తుంటాయి. గ్రామీణ ఆచార వ్యవహారాలు దైనందిన జీవితంలోని కష్టనష్టాలకు ఈ పాటలు అద్దం పడతాయి. బతుకమ్మ పాటల్లో పుట్టింటి ప్రేమలు అత్యంత సంగతులు సామాజికాంశాలు మిళితమై వాస్తవాలను కళ్ళ ముందు ఉంచుతాయి. పెతరామాస నుంచి బతుకమ్మ ప్రారంభమయ్యే రోజును "ఎంగిలి పూలు" గా పిలుస్తారు. వరుసగా తొమ్మిది రోజులు ఆడకూడదనే నమ్మకంతో ఆరో రోజును "అర్రెం"గా భావించి బతుకమ్మలను పేర్చరు. ప్రతిరోజు చీకటి పడే వరకు బతుకమ్మలను ఆడిన తర్వాత ఆయా గ్రామాలలోని చెరువులు కుంటలలో నిమజ్జనం చేస్తారు. నిమజ్జనం చేసే ముందు బాధతో...

"తంగేడు పూవుల్ల చందమామ
మల్లెన్నడొస్తావు చందమామ
గునుగు పూవుల్ల చందమామ
బతుకమ్మ పోతుంది చందమామ
పోతే పోతివి చందమామ
మల్లెన్నడొస్తావు చందమామ
ఏడాదికోసారి చందమామ
ఆడుకుంటూ వస్తా చందమామ"

.... అంటూ బతుకమ్మను సాగనంపుతూ పిండితో చేసిన ప్రమిదలలో నూనె పోసి బతుకమ్మలపై ఉంచి జ్యోతులు వెలిగిస్తారు. అనంతరం పసుపు గౌరమ్మను తీసుకుని బతుకమ్మలను నిమజ్జనం చేస్తారు. గౌరమ్మగా చేసిన పసుపు ముద్దను వాయనంగా స్వీకరిస్తారు. వాయనాలిచ్చుకుంటూ...

'ఉసికెలో పుట్టే గౌరమ్మా
ఉసికెలో పెరిగే గౌరమ్మా
కుంకుమల పుట్టే గౌరమ్మా
కుంకుమల పెరిగే గౌరమ్మా
పసుపుల పుట్టే గౌరమ్మా
పసుపుల పెరిగే గౌరమ్మా'...

అంటూ పాటలు పాడి తమతో తెచ్చుకున్న ఫలహారాలను సద్దులను పంచుకుని ఆరగిస్తారు.

### 'బతుకమ్మా' దీవెనయే బతుకమ్మ

తెలంగాణ సంస్కృతికి ఆచార వ్యవహారాలకు అద్దం పట్టే బతుకమ్మ పండుగ ఆవిర్భావానికి అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి. చోళ వంశానికి చెందిన ధర్మాంగుడు సత్యవతి అనే రాజదంపతులకు చాలా కాలం పాటు సంతానం కలగలేదు. వారు చేసిన నోములతో వందమంది కొడుకులు పుట్టినా వారంతా యుద్ధంలో చనిపోతారు. దీంతో విషాదాన్ని తట్టుకోలేక రాజదంపతులు అడవికి వెళ్లి చేసిన తపస్సుకు లక్ష్మీదేవి ప్రత్యక్షమై వారి బిడ్డగా పుడతానని వరం ఇస్తుంది. ఈ మేరకు పుట్టిన బిడ్డ కలకాలం బతకాలని ఋషులు 'బతుకమ్మ' అని నామకరణం చేస్తారు. బతుకమ్మ పెరిగి పెద్దదై చక్రాంకునిగా పుట్టిన శ్రీహరిని(శ్రీ మహావిష్ణువు) పెళ్లి చేసుకున్నట్లుగా కథ ప్రచారంలో ఉంది. అప్పటినుంచి చోళ రాజ్యంలో బతుకమ్మ సంక్షేమం కోసం పండుగ చేసుకోవడం ఆనవాయితీగా మారిందని, 'బతుకమ్మా ' అనే దీవెనయే బతుకమ్మగా ప్రసిద్ధి చెందింది. శ్రీ మహావిష్ణువు చక్రాంకుడి పేరుతో బతుకమ్మను వివాహమాడడంతో అప్పటినుంచి జానపదులు ' బతుకమ్మ 'ను లక్ష్మీదేవిగా పూజిస్తున్నారు. చాలా ప్రాంతాల్లో ఈ వృత్తాంతాన్ని ..

శ్రీ లక్ష్మీదేవియు ఉయ్యాలో
సృష్టి బతుకమ్మాయె ఉయ్యాలో
పుట్టిన రీతి చెప్పే ఉయ్యాలో
భట్టు నరసింహ కవి ఉయ్యాలో
ధరచోళ దేశము ఉయ్యాలో
ధర్మాంగుడను రాజు ఉయ్యాలో
ఆ రాజు భార్యయు ఉయ్యాలో
అది సత్యవతి యండ్రు ఉయ్యాలో
నూరు నోములు నోమి ఉయ్యాలో
నూరు మందిని గాంచె ఉయ్యాలో
వారు శూరులై ఉయ్యాలో
వైరులచే మృతులైరి ఉయ్యాలో

...అంటూ ఉయ్యాల పాటగా పాడిన తర్వాతనే మిగిలిన పాటలు పాడుతారు.

### బతుకమ్మగా మారిన కాకతమ్మ పూజ

'బతుకమ్మా' అనే దీవెనతో బతుకమ్మగా మారిన ఈ పండుగ తెలంగాణలో మొట్టమొదట కాక తమ పూజగా మెలుగొందింది . కాకతమ్మ పూజయే బతుకమ్మగా మారిందని చారిత్రకుల అభిప్రాయం. కాకతమ్మ ఉత్సవాలు శాలివాహన శకం 1185 రుథిరోద్గారి నామ సంవత్సరం ఆశ్వీజ శుద్ధ పాడ్యమి నుంచి ప్రారంభమయ్యాయని అంచనా. కాకతమ్మ (కాకతీదేవి) కాకతీయ గణానికి కుల దేవత. ఆర్య క్షత్రియ గోత్రాల్లో ఒకటైన కాకతీయ గణం వేద కాలం నుంచి ప్రసిద్ధి చెందింది. కాకతీయ వంశం వారసులైన చాళుక్యులు రాజ్యాలను ఏలుతున్న కాలం నుంచి కాక తమ గురించి రకరకాల కథలు ప్రచారంలో ఉన్నాయి. కాకతీయుల కాలంలో కాకతమ్మ ఉత్సవాలు బతుకమ్మ పండుగగా మారి తెలంగాణలో బహుళ ప్రచారం పొందాయి.

### జానపద సంస్కృతికి ప్రతీక

బతుకమ్మ పండుగ తెలంగాణలో జానపద సంస్కృతికి ప్రత్యేకగా నిలుస్తున్నది. ఈ పండుగ ఆవిర్భావం పై ఆసక్తికరమైన జానపద కథ ప్రచారంలో ఉంది. పూర్వం కాపు(రైతు) దంపతులకు ఆరుగురు కొడుకులు పుట్టినప్పటికీ అందరూ పురిట్లోనే చనిపోయారట. ఏడో కాన్పులో కుమార్తె పుట్టడంతో బతుకమ్మ అని పేరు పెట్టారు. అనంతరం వారికి ఇంకో కొడుకు పుట్టాడట. యుక్త వయసు వచ్చాక బతుకమ్మకు చేసి జరిపించి అత్తవారింటికి పంపిస్తారు. కొన్నాళ్ల తర్వాత బతుకమ్మ తన సోదరుని చూసేందుకు పుట్టింటికి వెళ్లి, తన మరదలితో కలిసి చెరువులో స్నానం చేసేందుకు వెళుతుంది. చెరువు గట్టు పైన దుస్తులు పెట్టి చెరువులో దిగి స్నానం చేసి వచ్చేసరికి గాలివాటం వల్ల ఇద్దరి దుస్తులు కలిసిపోయాయట. పొరపాటున ఒకరి దుస్తులు ఒకరు ధరించారు. దీంతో ఆడపడుచునైన తన దుస్తులు ఎందుకు ధరించావని బతుకమ్మ తన మరదలిపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆవేశానికి లోనైన మరదలు బతుకమ్మను గొంతు నులిమి చంపి, చెరువు గట్టున పాతి పెట్టి ఇంటికి వెళు తుంది. అదే రాత్రి తన భర్తకు బతుకమ్మ కలలో కనిపించి తనను తీసుకెళ్లాలని వేడుకుంటుంది. మరునాడు ఆమె భర్త బతుకమ్మను తీసుకెళ్ళేందుకు అత్తగారింటికి వెళతాడు. బతుకమ్మను పాతిపెట్టిన చెరువుగట్టు వద్దకు అతను చేరుకునేసరికి అంతకు ముందెన్నడూ చూడని, కనిపించని తంగేడు చెట్టు కనిపిస్తుంది. ఆశ్చర్యంతో ఆ పూలను తెంపేందుకు ప్రయత్నించగా, ఆ చెట్టు పాపిష్టి మరదలు తనను చంపి పాతి పెట్టింది అని చెప్పిందట. ప్రతి ఏటా తంగేడు పూలతో బతుకమ్మను పేర్చి పైన గౌరమ్మను నిలిపి పూజ చేసి చెరువు గట్టున ఆడిన తర్వాత నీటిలో విడిచి పెట్టాలని కోరిందట. బతుకమ్మ భర్త ఈ మేరకు ముత్తయిదువులకు చెప్పి వారి ద్వారా బతుకమ్మ కోరికను తీర్చే వాడట. అప్పటినుంచి ఆడపడుచులు ఈ పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా మారిందని చెబుతారు.

లిలిలి మహిషాసుర మర్దనంతో... లిలిలి

లోకంటకుడైన మహిషాసురుడిని చంపిన గౌరీ దేవి అలసిపోయి ఆశ్వయుజ శుద్ధ పౌర్ణమి నాడు మూర్ఛపోయిందని ఆమెను స్పృహలోకి తెచ్చేందుకు స్త్రీలంతా భక్తి తో పాటలు పాడడంతో ఐదో రోజు లేచిందని పురాణ గాథ ప్రచారంలో ఉంది. మహిషాసుర మర్దని తేరుకునేందుకు 'బతుకమ్మా ' అంటూ అనేక రకాలుగా వేడి నందున ' బతుకమ్మ ' అయ్యిందని జానపద అభిప్రాయం.

### బృహదమ్మే... బతుకమ్మా?

పెత్తరామాస నాడు ఎంగిలి పూల బతుకమ్మతో మొదలై ఆశ్వీయుజ శుద్ధ అష్టమి(దుర్గాష్టమి) నాడు సద్దుల బతుకమ్మతో సద్దుమణిగే ఈ పండుగలు ఎన్నో పాటలు కబుర్లు జ్ఞాపకాలు నిన్నప్పటికీ బతుకమ్మ గురించి ఇంకా తెలుసుకోవాల్సింది ఎగిరే ఉంటుంది ఇప్పటివరకు బతుకమ్మ పండుగ మూలాలు వెలుగులోకి రాలేదు కాకతీయుల కాలం నుంచి బతుకమ్మ పండుగ ఉందని చెబుతున్నప్పటికీ అంతకుముందు నుంచే ఈ పండుగ మూలాలు ఉన్నట్లు తెలుస్తోంది కాకతీయుల కాలానికి వందల సంవత్సరాల ముందు నుంచి తెలంగాణ ప్రజలు ఇప్పటికీ కొనసాగిస్తున్న నిరసన ఉద్యమం బతుకమ్మ అని తెలుస్తున్నది. చరిత్ర పరిశోధకుల పరిశీలనల మూలాల్లోకి వెళితే....

ఒకప్పుడు వేములవాడ చాళుక్య రాజులు రాష్ట్రకూటుల సామంతులు. చోళులకు రాష్ట్ర కూటులకు యుద్ధం జరిగితే వేములవాడ చాళుక్యులు రాష్ట్ర కూటుల వైపు యుద్ధం చేసేవారు. రాష్ట్రకూటుల సామంతుడైన రెండో తైలపుడు క్రీ.శ. 973 లో చివరి రాష్ట్ర కూట రాజు రెండో కర్కుడిని(కర్కుడు-2) ను ఓడించి స్వతంత్ర కళ్యాణి చాళు క్య రాజ్యం స్థాపించాడు. ప్రస్తుత తెలంగాణ ప్రాంతం ఇతడి ఆధీనంలో ఉండేది. తైలపుడు మరణించిన తర్వాత అతని కుమారుడు సత్యాశ్రయుడు క్రీ.శ.997లో రాజయ్యాడు. అప్పటికే వేములవాడ చారిత్యా రాజ్యంలోని వేములవాడ రాజేశ్వరాలయం ప్రసిద్ధి చెందింది తెలంగాణ ప్రజల ఇష్టదైవంగా రాజేశ్వరుడు ఇక్కడ నిత్య పూజలు అందుకునేవాడు చోళ రాజైన పరాంతక సుందర చోళుడు రాష్ట్రకూటల దండయాత్రను ఎదుర్కోలేక కష్టాల్లో ఉన్నాడు ఆపదలో ఉన్న వారిని ఆదుకునే దైవంగా రాజరాజేశ్వరుని గురించి తెలుసుకున్న పరాంతక సుందర చోళుడు రాజరాజేశ్వరుడి భక్తుడిగా మారాడు. తన రెండో కుమారునికి రాజరాజ అనే పేరు పెట్టుకున్నాడు. పరాంతక సుందర చోళుడు తన కుమారునికి తన ఇష్టదైవం అయిన రాజరాజేశ్వరుడి పేరు పెట్టుకున్నట్లు 'అరికేసరి శాసనం 'లో పేర్కొన్నారు. రాజరాజ చోళుడు క్రీ.శ.985-1014 కాలంలో రాజ్యపాలన చేశాడు. ఇతని కుమారుడైన రాజేంద్ర చోళుడు సైన్యాధ్యక్షుడిగా తొమ్మిది లక్షల సైన్యంతో బీజాపూర్ జిల్లాలోని దోనూర్ వద్ద చాళుక్యుల మీద దండయాత్ర చేసి సత్యాశ్రయుడి మీద విజయం సాధించాడు. చాళుక్యుల ఈ విజయానికి గుర్తుగా రాజేశ్వరుడి దేవాలయాన్ని ధ్వంసం చేసి అందులోని బృహత్ శివలింగాన్ని తన తండ్రికి కానుకగా తంజావూరు తీసుకెళ్లాడు. ఈ (బృహదీశ్వరుడి) లింగానికి తంజావూరులో క్రీ.శ. 1006వ సంవత్సరంలో రాజరాజ చోళుడు దేవాలయ నిర్మాణాన్ని ప్రారంభించి,పూర్తి చేసిన తరువాత క్రీ.శ. 1010లో లింగ ప్రతిష్టాపన చేశాడు. బృహదీశ్వర దేవాలయం దక్షిణ భారత దేశంలో ఎత్తైన "కలశం (విమాన గోపురం) తో ఉన్నది. ఈ కలశాన్ని సుమారు 81.28 టన్నులు బరువు కలిగిన నల్లరాతితో చెక్కారు. బృహదీశ్వరాలయాన్ని ప్రపంచ వారసత్వ సంపదగా యునెస్కో గుర్తించింది. ఈ బృహదీశ్వరాలయాన్ని వేములవాడ చాళుక్య దేశంపై జరిగిన దండయాత్రలో స్వాధీనం చేసుకున్న ధనంతో నిర్మించినట్టు తమిళ శాసనాల్లో చోళ రాజులు ప్రకటించుకున్నారు. వేములవాడ భీమన్న గుడిలోని శివలింగం తంజావూరు లోని గృహదీశ్వరాలయంలోని శివలింగం ఒకే విధంగా ఉండడం ఇప్పటికీ గమనించవచ్చు. దీనికి కారణం అయిన రాజ రాజ చోళుడికి 'తెలింగ కులకాలుడు' అనే బిరుదు కలదు. ఈ బిరుదును రాజరాజు చోళుడు తంజావూరు నిర్మించిన బృహదీశ్వరాలయంలోని శాసనాల్లో పేర్కొన్నారు. తెలింగ కులకాలుడు అంటే తెలంగాణకు యమ ధర్మరాజు అని అర్థం. వేములవాడ నుంచి శివలింగాన్ని దౌర్జన్యంగా తంజావూరుకు తరలించడం తెలంగాణ ప్రజలకు బాధ కలిగించింది. తెలంగాణ నుంచి లింగాకారమైన శివుడు వెళ్ళిపోయిన తర్వాత ఇక్కడున్న గుడిలో పార్వతిని (బృహదమ్మను) ఊరడించి ప్రయత్నం తో పాటు చోళులకు తమ నిరసన తెలపడం కోసం పూలతో (సృష్టి) మేరు పర్వతంలా బతుకమ్మను పేర్చారు దానిపై పసుపు గౌరమ్మను ఉంచి దసరా సందర్భంలో తొమ్మిది రోజులు ఆటపాటలతో పదేపదే తలిచేవారు. చివరగా తిరిగి రమ్మంటూ నీళ్లలో వదలడం ఒక పండుగగా మారింది. తెలంగాణ ప్రజలకు బాధ కల్గించిన ఈ విషయానికి నిరసనగా సృష్టికి కారణ భూతమైన శక్తి రూపాన్ని బృహదమ్మగా(బృహత్ అమ్మ అంటే గొప్ప అమ్మగా)పూజించారు. ఈ బృహదమ్మ నుంచి బతుకమ్మ అనే పేరు వచ్చింది. అందుకే బతుకమ్మ పండుగ అనేది 1000 సంవత్సరాల కంటే ఎక్కువ కాలం నుంచి వస్తున్న ఒక సామూహిక నిరసన ఉద్యమం. శివుడు లేని పార్వతిని ఊరడించడానికి అమ్మవారి పేరు మీద మాత్రమే పాటలు పాడుతారు. దీనికి నిదర్శనంగా...

"ఒక్కేసి పువ్వేసి చందమామ
ఒక్క జాము అయ్యే చందమామ
శివుడొచ్చే వేళాయే చందమామ
శివుడింక రాకపాయే చందమామ"...

.... అంటూ అమ్మవారి ఊరడింపు పాటను బతుకమ్మ ను నిమజ్జనం చేసే ముందు పాడటాన్ని చెప్పుకోవచ్చు.

### ఆరాధించే విధానం

పాడి పంటలు, జీవనదులు, అటవీ సంపద జానపదుల జీవితంలో సుఖాలకు ప్రతీకలయితే, కరువు కాటకాలు, తుఫానులు, భూకంపాలు కష్టాలకు సంకేతాలు. సుఖాలను పొంది కష్టాలను ఎదుర్కొనేందుకు జానపదులు ప్రకృతిని పూజిస్తారు. ప్రకృతిని ఆరాధించే విధానమే బతుకమ్మగా మారిందని చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు. ప్రకృతి ఒడిలో పుట్టి పెరిగిన జానపదులు తమ ఆచార వ్యవహారాలను ప్రతిబింబించే విధంగా జరుపుకున్న బతుకమ్మ పండుగ తర్వాత కాలంలో తెలంగాణలో ప్రసిద్ధి చెందిందని భావిస్తున్నారు.

### ఔషధ గుణాలతో మేలు

కొమ్మ చెక్కితే బొమ్మరా... కొలిచి మొక్కితే అమ్మరా ... అని తెలంగాణ రాష్ట్ర గీత రచయిత అందేశ్రీ రాసినట్లు కొమ్మన పూసిన పూలు బతుకమ్మ వేడుకల్లో ప్రాముఖ్యం వహిస్తాయి. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగలో పూల బతుకమ్మ గౌరమ్మ తల్లిగా పూజలు అందుకుంటుంది. పూలతో పూజించడం ఈ పండుగ ప్రత్యేకత. వినాయక చవితి సందర్భంగా గణపతిని నవరాత్రులలో పూజించినట్లుగా బతుకమ్మను తొమ్మిది రోజులు నిర్వహిస్తారు. వినాయకుడిని గరిక పత్రి, పూలతో పూజించి చివరి రోజు నిమజ్జనం చేయడం తెలిసిందే. అలాగే బతుకమ్మలను పూలతో అలంకరించి ఏరోజుకారోజు నీటిలో నిమజ్జనం చేస్తారు. దీనివల్ల తంగేడు పూలు, గరిక పూలు, ఆకులలో ఉన్న ఔషధ గుణాలు నీటిలో కలిసి ఆవిరిగా మారడం వల్ల మానవాళికి మేలు జరుగుతుందని ప్రతీతి. వర్షాకాలంలో కురిసే వానలతో వరదలు పారి చెరువులు కుంటలు నీటితో కళకళలాడుతుంటాయి. ఎక్కడెక్కడి నుంచో వరదలు రావడం వల్ల నీరు కలుషితం అయి అంటు రోగాలు ప్రబలే అవకాశాలు ఎక్కువ. బతుకమ్మలకు ఉపయోగించే పువ్వులు ఈ నీటిని శుద్ధి చేస్తాయి. పూలలో ఉండే ఔషధ గుణాలు ఉన్నాయి. ఈ గుణాలు నీటిలో కరిగి మానవాళిని వివిధ వ్యాధులనుంచి రక్షిస్తాయని నమ్ముతారు. బతుకమ్మను పూలతో ఆరాధించడం వల్ల జగత్తుకు మేలు జరుగుతుందని భావిస్తారు.

### పూలలో ఉండే ఔషధ గుణాలు

# రాష్ట్ర యువజన వారోత్సవాలకు జడ్జిగా చంటి



సిద్ధిపేట ప్రతినిధి, మేజర్ న్యూస్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో సిద్ధిపేట విపంచిలో జరిగే కళా ఉత్సవ పోటీలకు న్యాయం నిర్ణేతగా రాష్ట్రస్థాయి యూత్ అవార్డు గ్రహీత ప్రముఖ డాన్స్ మాస్టర్ మరియు యాంకర్ చంటిని నియమించినట్లుయువజన సర్వీసుల శాఖ కోఆర్డినేటర్ వెంకటేశం ఉత్తర్వులు జారీ చేశారని చంటి సోమవారం రోజున విలేకరులతో మాట్లాడుతూ అన్నారు. తెలంగాణ గ్రామీణ ప్రాంత జానపదాన్ని భారతదేశానికి అందించే కళాకారులను తయారు చేయాలని కోరారు .ఎంతో మంది యువ ఉత్సవ కళాకారులు ఉన్నారని వారి ప్రతిభను చాటి చెప్పుకోవటానికి ఇలాంటి వేదికలు చాలా అవసరమని తెలిపారు. కళాకారులు ప్రతిభను ఈ పోటీలలో పాల్గొని కళా నైపుణ్యాన్ని ప్రదర్శించి జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రతిభను చూపడానికి చక్కటి అవకాశం అని కళాకారులకు పిలుపునిచ్చారు . కార్యక్రమం సిద్ధిపేట విపంచి ఆడిటోరియంలో నేడు 10 గంటల నుంచి ప్రారంభం అవుతున్నట్లు తెలిపారు. జానపద నృత్యం భరతనాట్యం మరియు పాటలు తదితరాంశాల్లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు.యువతి యువకులు పాల్గొని ప్రథమ ద్వితీయ బహుమతులు గెలుచుకోగలరని సూచించారు. గెలుపొందిన వారికి రాష్ట్రస్థాయిలో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలియజేశారు. అవకాశం కల్పించిన యువజన సర్వీసుల శాఖ కోఆర్డినేటర్ వెంకటేశం కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల నమోదు ఈ- పాస్

**వెబ్సైట్ నందు నూతన మార్గదర్శకాలు**

**ప్రభుత్వ ప్రైవేటు కళాశాలల ప్రధానాచార్యులు విద్యార్థులకు అవగాహన కల్పించాలి.**

**షెడ్యూల్డ్ కులాలు అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు . టి. అఖిలేష్ రెడ్డి.**

సంగారెడ్డి మేజర్ న్యూస్. : 2024-25 విద్యా సంవత్సరమునకు గాను సంగారెడ్డి జిల్లాలోని అర్హులైన ఎస్సీ విద్యార్థుల పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనముల నమోదుకు సంబంధించి నూతన విధి విధానాలు కేంద్ర ప్రభుత్వ మార్గధార్శకాలకు అనుగుణంగా ఇ-పాస్ వెబ్ సైట్ నందు మార్పు చేయడం జరిగిందని, దీని ప్రకారం ప్రతి అర్హులైన ఎస్సీ విద్యార్థుల పేరు యస్.యస్.సి మెమోలో ఉన్న విధంగానే ఆధార్ నందు ఉండాలని, విద్యార్థి ఆదాయ పరిమితి రూ. 2,00,000/- నుండి రూ.2,50,000/- లకు పెంచడం జరిగిందనీ షెడ్యూల్డ్ కులాలు అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు . టి. అఖిలేష్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.ఇ-పాస్ లో నమోదు ప్రక్రియ: మొదటి దశ మొదటగా విద్యార్థి ఇంటర్నెట్ సెంటర్ నందు యస్.యస్.సి వివరాలు, ఆధార్ కార్డ్ వివరాలతో సరిపోలిన తర్వాత మాత్రమే తార్యాలిక 12 అంకెల ఇ- పాస్ ఇ.డి ఇవ్వబడుతుంది. ఒకవేళ విద్యార్థి యస్.యస్.సి మెమోలో పొందు పరిచిన వివరాలు ఆధార్ వివరాలతో సరిపోనియెడల దగ్గరిలోని మీసేవ కేంద్రం లొ ఆధార్ వివరాలు సరిచేసుకొనవలెను.రెండవ దశ బీ తదుపరి బట్టి ఇ-పాస్ ఐ.డి నెంబర్ తో దగ్గరిలోని మీసేవ కేంద్రం వర్ష బయో మెట్రిక్ చేయవలసి ఉంటుంది.మూడవ దశ బయో మెట్రిక్ అనంతరం విద్యార్థి దగ్గరిలోని ఇంటర్నెట్ సెంటర్ ను సంప్రదించి పూర్తి స్థాయి నమోదు ప్రక్రియ పూర్తి చేసి సంబంధిత ధృవ పత్రాలు జతపరచి సంబంధిత కళాశాలలో సమర్పించాలని, ఇట్టి విషయమై ప్రభుత్వ (ప్రైవేట్, ఎయిడెడ్ కళాశాల ప్రధానాచార్యులు వారి కళాశాలలోని విద్యార్థినీ, విదార్థులకు ఈ నమోదు ప్రక్రియ పైన అవగాహాన కల్పించాలని కోరారు.

# రాష్ట్ర స్థాయి యోగ పోటీల్లో సిద్దిపేట హవా

- గోల్డ్ మెడల్స్ సాధించిన క్రీడాకారులు.
- జాతీయ యోగా పోటీలకు ఎంపిక.




సిద్ధిపేట ప్రతినిధి, మేజర్ న్యూస్ : తెలంగాణ యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిజాంబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో సిద్దిపేట జిల్లా క్రీడాకారులు విజయదుందుభి మోగించారు. బంగారు




పతకాలను సాధించి సిద్దిపేట కీర్తిని వెలిగించారు. ఈ పోటీలోని విజేతలు త్వరలో జరిగే జాతీయస్థాయి యోగా పోటీల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తారు. ఈనెల 28న ప్రారంభమైన పోటీలు ఆదివారం రాత్రి ముగిసాయి. 18 నుంచి 28 వయసుల వారికి నిర్వహించిన రిథమిక్ పెయిర్స్ విభాగంలో సిద్దిపేట యువ యోగ క్రీడాకారులు ఎల్. సింధూరి, మనీషా లు ఫైనల్స్ లో విజేతలుగా నిలిచి బంగారు పతకాన్ని సాధించారు. 45 నుంచి 55 సంవత్సరాల మధ్య వయసుగల పురుషుల విభాగం లో ట్రెడిషనల్ ఈవెంట్ పోటీలో పల్లె సురేష్ గోల్డ్ మెడల్ సాధించాడు. 45 నుంచి 55 వయసు గల మహిళల విభాగం ట్రెడిషనల్ ఈవెంట్ లో సిద్దిపేట క్రీడాకారిణి ఉమాదేవి 4 వ స్థానం లో నిలిచారు.

28 నుంచి 35 వయస్సుల మహిళల విభాగం ట్రెడిషనల్ ఈవెంట్ నందు ప్రసన్న 4 వ స్థానం సాధించారు. విజేతలకు తెలంగాణ రాష్ట్ర యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఉపాధ్యక్షులు నందనం కృపాకర్ రామ్ రెడ్డి లు పతకాలను , సర్టిఫికెట్లను బహుకరించారు.

## విజేతలకు అభినందనలు

సిద్దిపేట జిల్లాకు చెందిన యువ క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో విశేష ప్రతిభ కనపరచడం పట్ల

సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు తోట అశోక్ , ప్రధాన కార్యదర్శి నిమ్మ శ్రీనివాస్ రెడ్డి లు లు హర్షం వ్యక్తం చేశారు. వీరికి ఉత్తమ శిక్షణ ఇచ్చిన యోగా శిక్షకులు తోట సతీష్ సంధ్యలను అభినందించారు. ఈ పోటీలను విజయం సాధించడం పట్ల సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు కె కె.అంజయ్య , చీఫ్ పాట్రన్ చిప్ప ప్రభాకర్ , ఉపాధ్యక్షులు విక్రం రెడ్డి , హరిప్రసాద్ తదితరులు విజేతలను , శిక్షకులను అభినందించారు.

# జిమ్‌తో ఆరోగ్యమే మహాభాగ్యం

**బొల్లారం మున్సిపల్ వైస్ చైర్మన్ అనిల్ కుమార్ రెడ్డి**

**బొల్లారంలో జిమ్ ప్రారంభం**



జిన్నారం మేజర్ న్యూస్ :ఆరోగ్యమే మహాభాగ్యమని బొల్లారం మున్సిపల్ వైస్ చైర్మన్ అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం బొల్లారం పట్టణంలో మహమ్మద్ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ది లెజెండ్ ఫిట్నెస్ యూని సెక్స్ జిమ్ ను మున్సిపల్ వైస్ చైర్మన్ అంతిరెడ్డి అనిల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... నేటి యువత సంపూర్ణ ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ జిమ్ కేంద్రాలకు తరలి వస్తున్నారని తెలిపారు. నిర్వాహకులు వారి అభిరుచుల మేరకు అత్యాధునిక జిమ్ పరికరాలను ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలను కల్పించుకోవడం అభినందనీయమని తెలిపారు. ఈ సందర్భంగా జిమ్ నిర్వాహకులను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వైస్ చైర్మన్ ను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాలసుబ్రమణ్యం రెడ్డి, ప్రముఖ బాడీ బిల్డర్ ఇమ్రాన్ ఖాన్, జిమ్ నిర్వాకులు, స్థానిక యువకులు పాల్గొన్నారు.

# శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడపాలి

**సిపి అనురాధ**

**ఎలాంటి సమస్యలు తలెత్తినా ఎల్లప్పుడూ అండగా ఉంటాం.**

**పదవి విరమణ చేసిన పోలీసు అధికారులకు కమిషనర్ కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు**



సిద్ధిపేట ప్రతినిధి, మేజర్ న్యూస్ : సుదీర్ఘంగా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన మహ్మద్ అలీముదిన్,మాచర్ల జనార్ధన్ పోలీస్ అధికారులకు సిపి అనురాధ సోమవారం రోజున పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులను అభినందించి సన్మాన పత్రం మెమొంటో అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పోలీస్ డిపార్ట్మెంట్లో సుదీర్ఘంగా సర్వస్ పూర్తి చేసుకుని పదవీ విరమణ చేయడం జరుగుతుంది. ఉద్యోగ నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి అందరి మన్ననలను పొందినారని శుభాకాంక్షలు తెలియజేస్తు రిటైర్డ్ మెంట్ బెనిఫిట్ పత్రాలు అందచేశారు. సిద్దిపేట పోలీస్ విభాగంలో సుధీర్ఘకాంగా విధులు నిర్వహించి పదవీవిరమణ చేసిన సిబ్బంది సేవను మరువమని, పదవీవిరమణ చేసిన పోలీస్ కుటుంబంలో ఎలాంటి సమస్య వచ్చిన తనను సంప్రదించ వచ్చని తెలిపారు. ఈ సమావేశంలో పదవీవిరమణ చేసిన పోలీస్ అధికారుల విధి నిర్వహణలో ఎదురైయిన అనుభవాను పోలీస్ కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. పోలీసు రిటైర్ మెంట్ కేవలం తన వృత్తికే, కాని తన వ్యక్తిత్వానికి కాదు" అని కొనియాడారు. విధి నిర్వహణలో పగలనక, రాత్రనక, పండగల సమయంలో భార్యా, పిల్లలకు దూరంగా ఉండి విధులు నిర్వహించినారు. పదవి విరమణ చేసిన పోలీసులు ఇకపై కుటుంబ సభ్యులతో అనందంగా వారి భావిజీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షినారు. అత్యవసరం అయినప్పుడు రిటైర్డ్ అయిన పోలీస్ అధికారుల సేవలు వినియోగించుకుంటారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు పూర్ణచందర్, విష్ణు ప్రసాద్, తెలంగాణ రాష్ట్ర పోలీసు ఉపాధ్యక్షుడు రవీందర్ రెడ్డి, సిసి నితిన్ రెడ్డి, మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ప్రతిష్టాపనకు భూమి పూజ

కొండపాక మేజర్ న్యూస్ : మండలంల పరిధిలో దుద్దెడ గ్రామ శివారులోని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ప్రతిష్టాపనకు దుద్దెడ గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో సోమవారం భూమి పూజ నిర్వహించారు ఈ సందర్భంగా గౌడ సంఘం సభ్యులు మాట్లాడుతూ బానిసత్వాన్ని ధిక్కరించి దళిత బహు జనులను రాజ్యాధికారం వైపు నడిపిన తొలి బహు జన రాజు అన్నారు. తన తల్లి పేరు పెట్టుకుని సర్వాయి పాపన్నగా ప్రసిద్ధి చెందారన్నారు. సమాజంలో పాతుకుపోయిన బలమైన ఫ్యూడల్ శక్తుల కోట గోడలను కొల్లగొట్టిన యోధుడు పాపన్న, శత్రువులకు చిక్కకుండా కోటల నిర్మాణం ద్వారా తన రాజ్యాన్ని ఏర్పాటు చేసుకొని దానిని విస్తరించడం కోసం అహర్నిశలు శ్రమించడం అసాధారణ అంశమని అన్నారు. భావితరాలకు పాపన్న సేవలు తెలిసేలా ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు ఆరెపల్లి మహదేవ్



గౌడ్,పెద్దంకుల శ్రీనివాస్ గౌడ్,గౌడ సంఘం సభ్యులు ఆరెపల్లి లింగం గౌడ్,ఆరెపల్లి భాస్కర్ గౌడ్ ,ఆరెపల్లి శ్రీనివాస్ గౌడ్,పంజాల శ్రీనివాస్ గౌడ్,పంజాల శ్రీనివాస్ గౌడ్,గున్నల వెంకటేష్ గౌడ్,దామోదార్ గౌడ్,దశరథం గౌడ్,పరందాములు గౌడ్ ,ఎల్లా గౌడ్,హరికిషన్ గౌడ్,తూర్పు గున్నల శ్రీనివాస్ గౌడ్,భాలేశం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలకు కొత్తగా ఓటర్ నమోదు చేసుకోవాలి



తూప్రాన్ ఆర్డీవో జయ చంద్రారెడ్డి

తూప్రాన్ :మేజర్ న్యూస్ : తూప్రాన్ డివిజన్ కేంద్రంలోని సోమవారం విలేకరుల సమావేశంలో ఆర్డీవో జయ చంద్రారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ
మెదక్ నిజామాబాద్ ఆదిలాబాద్ కరీంనగర్ పట్టభద్రులు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు ఓటర్ నమోదు ప్రక్రియ ఉమ్మడి జిల్లాల పరిధిలో ప్రస్తుతం 15 జిల్లాలు కేంద్ర ఎన్నికల సంఘం ,ఆదేశాలతో ఇప్పటికే జిల్లా కలెక్టర్లు నమోదుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు ఆన్లైన్ ఆఫ్లైన్ విధానాల్లో ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉంది డిగ్రీ ఉత్తీర్ణులైన వారు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో, స్కూల్ అసిస్టెంట్ జేఏలు జూనియర్ లెక్చరర్లు డిఏలు డిగ్రీ లెక్చరర్లు నమోదైన ప్రైవేట్ పాఠశాలల్లోని టీచర్లు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయడానికి ఉపయోగించుకోవాలని అర్హులైన వారు సీఈఓ తెలంగాణ అనే వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవచ్చు , నవంబరు మొదటి వారం నాటికి కొత్త ఓటరు జాబితాను రూపొందించాలని ఎన్నికల సంఘం విధివిధానాలను జిల్లాలకు పంపించింది సెప్టెంబర్ 30 నుండి నవంబర్ 6 వరకు ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతుంది ఆయన పేర్కొన్నారు, సవరణలు గడువు డిసెంబర్ 30న తుది ఓటరు జాబిత వెల్లడించనున్నారు. ఐదేళ్ల కిందట ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ఓటు వేసిన వారంతా తిరిగి కొత్తగా ఓటర్ నమోదు చేసుకోవాలి,

# వాహనాల్లో మార్గద్రవ్యాలు తరలిస్తే కఠిన చర్యలు తప్పవు సీఐ హనుమంతు

రాయికోడ్, సూర్య మేజర్ న్యూస్ వాహనాలను ముమ్మరంగా తనిఖీలు చేపట్టిన జహీరాబాద్ రూరల్ సీఐ హనుమంతు మరియు స్థానిక ఎస్సై నారాయణ రాయికోడ్ చౌరస్తా వద్ద ఆదివారం నాడు జహీరాబాద్ రూరల్ సీఐ హనుమంతు స్థానిక ఎస్సై నారాయణ మరియు సిబ్బందితో కలిసి వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేశారు ఈసందర్భంగా సీఐ హనుమంతు ఎస్సై నారాయణ మాట్లాడుతూ వాహనదారులకు లైసెన్సు ఇన్సూరెన్స్ సరియైన ఆధారాలు ఉండాలని పేర్కొన్నాడు తదుపరి సరియైన పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు రోడ్డు రవాణా నియమాలను ప్రతి ఒక్కరు పాటించాలని కోరారు వాహనాలు మద్యం సేవించి వాహనాలు నడపకూడదని వాహనాల తనిఖీలు చేస్తూ ఎవరికైతే వాహనదారులు చట్టాలను అక్రమించినా అతివేగంగా వాహనాలు నడిపిన సరియైన ధృవీకరణ పత్రాలు లేకుండా హేల్మేట్ ప్రయాణం చేసిన మరియు కారు ప్రయాణం చేసేటప్పుడు తప్పనిసరిగా సీటు బెల్టు ధరించాలని తెలిపారు అంతేకాకుండా మార్గద్రవ్యాలు గంజాయి గుట్కా వంటివి వాహనాలలో



లభ్యమైతే చట్టపరమైన చర్యలు తప్పవని తెలియజేశారు ఈ యొక్క కార్యక్రమంలో జహీరాబాద్ రూరల్ సీఐ హనుమంతు ఎస్సై నారాయణ సిబ్బంది గౌసోద్దీన్ రాజు తదితరులు పాల్గొన్నారు

# మంత్రి సీతక్కకు ఘన స్వాగతం

బెజ్జంకి,సూర్యన్యూస్: రాష్ట్ర పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం మొదటిసారి కరీంనగర్ జిల్లాకు వెళ్తున్న మంత్రి సీతక్కకు మండలంలోని బెజ్జంకి క్రాసింగ్ వద్ద కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ముక్కీస రత్నాకర్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు సోమవారం మంత్రి సీతక్కకు ఘన స్వాగతం పలికారు.పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సత్కరించారు.స్వాగతం పలికిన వారిలో ఏఎంసీ వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్ పులి సంతోష్,బీసీ సెల్ అధ్యక్షుడు గూడెల్లి శ్రీకాంత్,బోనాల ఐలయ్య పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# మంత్రిని మర్శిస్తే నాలుక చీరేస్తాం

## మా ఆడపడుచు జోలికొస్తే ఉరికించి ఉరికించి కొడతాం..
## కాంగ్రెస్ పార్టీ అధికారప్రతినిధి మచ్చ శ్రీనివాస్..



దుబ్బాక మేజర్ న్యూస్: జిల్లా ఇన్చార్జి మంత్రి. శ్రీమతి కొండా సురేఖ పై. అనుచిత వ్యాఖ్యలు చేస్తే. నాలుకలు చీరేస్తామని. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి. మచ్చ శ్రీనివాస్ అన్నారు. సోమవారం నాడు పద్మశాలి చేనేత కార్మికుల ఆధ్వర్యంలో మంత్రి పైన అనుచిత వ్యాఖ్యలు చేయించిన హరీష్ రావు కేటీఆర్ పెంపుడు కుక్కల సోషల్ మీడియా.పోస్టర్ను దగ్ధం చేశారు. కొండా సురేఖ తాను ఇన్చార్జి మంత్రిగా దుబ్బాక పట్టణంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సందర్భంగా స్థానిక పార్లమెంటు సభ్యులు రఘునందన్ రావు సిద్దిపేట, దుబ్బాక ప్రాంతాలలో చేనేత సమస్యలు అనేకం ఉన్నాయి, అక్కా అందుకే నూలు దండతో మీకు సమస్యల మాల వేస్తున్నాను ఒక తమ్ముడు అక్కకు రాఖీ కట్టి నట్టుగానే రఘునందన్ రావు చేనేత సమస్యలు తీర్చండి అన్నారు. నూలు దండ వేస్తే హరీష్ రావు కేటీఆర్ లు ఎమ్మెల్యే రఘునందన్ రావు చేనేత కార్మికుల పెళ్లికి కళ్యాణ లక్ష్మి, చెక్కు లు ఇప్పించడా అనీ అక్కా చెల్లెళ్ళ బంధాన్ని రాఖీ .దాన్ని వారి పెంపుడు కుక్కల ద్వారా తప్పుడు ప్రచారం చేస్తూ నూలుదండను, పద్మశాలి ఆడబిడ్డను అగౌరవపరుస్తూ విష ప్రచారం చేస్తున్నారు. మన పద్మశాలి ఆడబిడ్డను అవమానించిన కుక్కలు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.దుబ్బాకను అన్ని రంగాల్లో అభివృద్ధి చేద్దామని. మొట్టమొదటిసారి దుబ్బాక నియోజకవర్గం కి వచ్చినటువంటి మంత్రిని. అవమానపరచడం. దుబ్బాక నియోజకవర్గం ప్రజలువ్యతిరేకిస్తున్నారని.ఆయన తెలిపారు.దుబ్బాకకు మొట్టమొదటి శత్రువు. హరీష్ రావు అని. దుబ్బాక ప్రజలను ఆయన చెప్పుల కిందఉంచుకోవాలనే ప్రయత్నమే.మంత్రి పైన ఇలాంటి విమర్శలు చేస్తున్నారని అన్నారు.మహిళను రాజకీయంగా ఎదుర్కోలేక.ఇలాంటి నీచాతి నీచమైన రాజకీయం హరీష్ రావు చేస్తున్నారని.ఆరోపించారు. మంత్రి పైన అనుచిత వ్యాఖ్యలు చేసిన.సోషల్ మీడియాటిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా.నాయకులను కఠినంగా శిక్షించాలని.మా ఆడపడుచు జోలికి వస్తే.బట్టలు ఊడదీసిఉ రికిస్తామని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో చేనేత కార్మికులు.పద్మశాలి సమాజం అధ్యక్షులు.జిందం గాలయ.నాయకులు కడవెరు గోపి. ఆలేటి సరోజన. దాసరపు లక్ష్మి.మహిళ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఏడుపాయల్లో 3 నుంచి శరన్నవరాత్రోత్సవాలు

## 8న వనదుర్గామాతకు ఘనంగా బోనాలు
## 11న సుహాసిని పూజ, చండీ హెూమం

పాపన్నపేట మేజర్ న్యూస్: ఈనెల 3 నుంచి ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పాపన్నపేట మండలం ఏడుపాయల వనదుర్గా మాత సన్నిధిలో శరన్నవరాత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా మొదటి రోజు 3న స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు హాజరై అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభిస్తారన్నారు. మొదటి రోజైన గురువారం పాడ్యమిని పురస్కరించుకొని బాల త్రిపుర సుందరి (ముదురు పసుపు) రూపంలో దర్శనమిస్తుందని, 4న గాయత్రీ దేవిగా (గులాబి), 5న అన్నపూర్ణ దేవిగా (నీలం), 6న వనదుర్గాదేవిగా (ఆకుపచ్చ), 7న మహాలక్ష్మి దేవిగా (పెసరు), 8న దుర్గాదేవి (ముదురు నీలం), 9న సరస్వతి దేవి (తెలుగు), 10న మహిషాసుర మర్దిని దేవిగా (ఎరుపు), 11న సర్వ నారాయణి దేవిగా (మెరూన్), చివరి రోజు 12న విజయదశమిని పురస్కరించుకొని రాజరాజేశ్వరి దేవి (పసుపు)గా వనదుర్గమ్మ దర్శనం ఇస్తారని తెలిపారు. ప్రతిరోజు ప్రాతఃకాల సమయాన అమ్మవారికి అభిషేకం, ఉదయం విఘ్నేశ్వర పూజ తదితరాలు నిర్వహిస్తామని తెలిపారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. 8న వనదుర్గామాతకు అంగరంగ వైభవంగా బోనాలు, 11న సుహాసిని పూజ, చండీ హెూమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. భక్తులు ఇట్టి కార్యక్రమాలకు అధిక సంఖ్యలో పాల్గొని వనదుర్గామాత కృపకు పాత్రులు కాగలరని వారు కోరారు.

# ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాల (గజ్వేల్)ను సందర్శించిన ఆర్జెడి



గజ్వేల్ మేజర్ న్యూస్ :-కమిషనరేట్ ఆఫ్ కాలేజీఎట్ ఎడ్యుకేషన్ హైదరాబాద్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ డి. ఎస్.ఆర్ రాజేంద్ర సింగ్ సోమవారం మహిళా డిగ్రీ కళాశాలను సందర్శించారు. అందులో భాగంగా కళాశాల విద్యార్థినులతో ముఖా ముఖిలో పాల్గొన్నారు. కళాశాలలోని సమస్యల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మహిళలకువిద్య ఎంత అవసరమో తెలియజేస్తూ విద్యార్థినులు అనేక రకాల పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని అందుకు కావలసిన స్టడీ మెటీరియల్ ను కళాశాల గ్రంథాలయంలో ఏర్పాటు చేస్తానని తెలియజేశారు. ఒక చదువుకున్న మహిళ కుటుంబంలోని అన్ని తరాలకు దారి చూపుతోందని, అంతేకాక మహిళలు ఆర్థిక,సామాజిక, రాజకీయ సాధికారతకు విద్య ఎంతో అవసరమని పేర్కొన్నారు.

అనంతరం కళాశాల అధ్యాపక బృందంతో సమావేశమై కళాశాలలో జరుగుతున్న బోధన, అభ్యసన కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. అధ్యాపకులు అంకితభావంతో పనిచేసి విద్యార్థునుల సర్వతో ముఖాభివృద్ధికి కృషి చెయ్యాలని ఈ సందర్భంగా సూచించారు. కళాశాల విద్యా కమిషనర్ దేవసేన ఐఏఎస్ ఆదేశాల మేరకు తనిఖీకి విచ్చేసినట్లుగా చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కమలా క్రిస్టియాన, వైస్ ప్రిన్సిపల్ శ్రీలత కళాశాల ఐ క్యు ఏసి కోఆర్డినేటర్ మహాలక్ష్మి,స్టాఫ్ క్లబ్ సెక్రటరీ వీరయ్య,అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థుల అభ్యున్నతికి... దాతల సహకారం అవసరం

### డిసిసి అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి



గజ్వేల్ మేజర్ న్యూస్ :-ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే పేద విద్యార్థులకు దాతల సహకారం అవసరమని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని క్యాసారం ప్రభుత్వ పాఠశాలలో మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, ఏఎంసీ చైర్మన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, కౌన్సిలర్ వంటేరు గోపాల్ రెడ్డిలతో కలిసి దాత కప్ప భాస్కర్ సహకారంతో 50 మంది విద్యార్థులకు దుస్తులు, స్టడీ మెటీరియల్ అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరిలో సామాజిక స్పృహ అవసరమని, తోటి వారికి చేతనైనంత సహాయం చేస్తే భగవంతుని ఆశీస్సులు మనపై అన్ని రకాలుగా ఉంటాయని స్పష్టం చేశారు. అంతేగాకుండా క్యాసారం పాఠశాల అభివృద్ధికి తన వంతు పూర్తి సహకారం ఉంటుందని, ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని ప్రధానోపాధ్యాయులు రవీందర్రావును కోరారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రకాలుగా పెద్దపీట వేస్తుండగా, విద్యతోనే పేద వర్గాల అభ్యున్నతి సాధ్యపడుతుందని, ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు గురుకుల తరహాలో విద్యాబోధన అందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు గంగిశెట్టి రాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు యాదగిరి, కరుణాకర్ రెడ్డి, నర్సింహారెడ్డి, డాక్టర్ వహీద్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మొనగారి రాజు, రాములు గౌడ్, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, రవీందర్ రెడ్డి, సందీప్ రెడ్డి, మాజీ ఎంపీపీ మోహన్, నాయకులు సురేష్, అంజద్, క్యాసారం బాబా తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మక్క కుటుంబానికి ఉన్నత పదవి ఇవ్వాలి

### దివంగత టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి సోమన్న గారి లక్ష్మక్కకు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



నర్సాపూర్ సూర్య మేజర్ న్యూస్ : నర్సాపూర్ పట్టణంలో దివంగత టీపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి సోమన్న గారి లక్ష్మక్క కుటుంబానికి ఉన్నత పదవి ఇవ్వాలని కాంగ్రెస్ శ్రేణులు వెల్లడించారు సోమవారం నర్సాపూర్ పట్టణంలో దివంగత మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సోమన్న గారి లక్ష్మక్క జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు ఆమె చిత్రపటానికి ఘనంగా అర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి లక్ష్మక్క ఎంతగానో కృషి చేసిందని వారు గుర్తు చేశారు బలుగు బలహీన వర్గాలకు ప్రాతినిథ్యం ఉండాలన్న గొప్ప వ్యక్తి లక్ష్మక్కని వారు పేర్కొన్నారు లక్ష్మక్క పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందని వారు అన్నారు లక్ష్మక్క ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలంగాణ ఉద్యమంలో ఎన్నో పోరాటాలు చేసిన వ్యక్తి అని అన్నారు ప్రతి సంవత్సరం.బతుకమ్మ పండుగ వచ్చిందంటే మహిళలు అందరినీ నియోజకవర్గంలో బతకమ్మ ఊరేగింపు కార్యక్రమం నిర్వహించేదని అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ టి పి సి సి రాష్ట్ర నాయకులు సోమన్న గారి రవీందర్ రెడ్డి సుహాసిని రెడ్డి కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సత్యం సుజాత జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ నాయకులు శ్రీనివాస్ గుప్తా అశోక్ గౌడ్ గుర్రాల అశోక్ మల్లేశం ఉదయ్ హబీబ్ ఖాన్ శ్రీనివాస్ గౌడ్ లలిత నర్సింగ్ బండారి గంగాధర్ సుదర్శన్ గౌడ్ నరేందర్ రెడ్డి సురభి వినోద రాధాకృష్ణ గౌడ్ ఆంజనేయులు గౌడ్ సురేష్ నాయక్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు పరిష్కారంపై ప్రతి వారం సమీక్ష నిర్వహిస్తాం

### ప్రజావాణిలో ప్రజల నుండి 87 దరఖాస్తు స్వీకరణ

### : జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



మెదక్ మేజర్ న్యూస్ ప్రతినిధి : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు పరిష్కార స్వభావంపై ప్రతి వారం సమీక్ష నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం ఐడిఓసి కార్యాలయపు సమావేశపు హాలులో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులకు ఎండార్స్మెంట్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యలతో వచ్చిన ప్రజల పట్ల జవాబుదారీగా ఉండాలని అన్నారు. ప్రజావాణి, ప్రతి సోమవారం అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తామని స్పష్టం చేశారు.మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అభివృద్ధి కార్యక్రమాలు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. మండల పర్యటనలో గుర్తించిన సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజావాణి దరఖాస్తులు పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మన పరిధిలో పరిష్కరించడానికి అవకాశం ఉన్న దరఖాస్తులు పరిష్కరానికి.కాలయాపన చేయొద్దని పేర్కొన్నారు. జిల్లా నలుమూల నుండి భూ సమస్యలు 25, పెన్షన్స్ -04, డబల్ బెడ్ రూమ్ ఇండ్లు 19, ఇతర సమస్యలు-39, దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డి ఆర్ డి ఏ పి డి శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్, సంబంధిత ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# "గౌతము"ని ఆచరణే అంబేద్కర్ ఇజం

### "గౌతోజిగూడ" సంఘటనను ఖండిస్తున్నాం. సామాజిక సమరసత వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్



్వేల్ మేజర్ న్యూస్ :-గౌతమ బుద్ధుని సిద్ధాంతాలను అంబేద్కర్ మహనీయుడు ఆచరణలో పెట్టి జాతికి ఏనలేని సేవలు అందించాడని సామాజిక సమరసత వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్ అన్నారు. సోమవారం గజ్వేల్ పట్టణంలోని స్థానిక శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో జరిగిన సమరసత సాహితి పక్షోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన కవి సమ్మేళనంలో మాట్లాడుతూ స్వతంత్ర భారత్ వజ్రోత్సవాలు జరుపుకుంటున్న వేల మెదక్ జిల్లా గౌతోజిగూడ గ్రామంలో జరిగిన సంఘటన అమానవీయమనీ,దురదృష్టకరమని విచారం వ్యక్తం చేశారు. ఈ సంఘటనను సమరసత వేదిక తీవ్రంగా ఖండిస్తుందన్నారు. సామాజిక సమరసత వేదిక తెలుగు రాష్ట్రాల్లో నిర్వహిస్తున్న " సమరసత సాహితీ పక్షోత్సవాల" సందర్భంగా మహాకవులు గుర్రం జాషువా, బోయి భీమన్న, దున్న ఇద్దాసు, చిలకమర్తి లక్ష్మీ నరసింహం జయంతులను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. హిందూ సమాజంలో ఆనాడు నెలకొని ఉన్న కుల వివక్షత, అంటరానితనం నిర్మూలనకు వారు చేసిన కృషి శ్లాఘనీయం అన్నారు. వారు అందించిన సాహితీ సేవలు, సమాజంలో కలిగించిన చైతన్యం ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆనాటి కవులు ఇప్పటి సమాజానికి ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. అందులో భాగంగానే సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో ఈ కార్యక్రమం నిర్వహించడం, ఇక్కడి కవులను సన్మానించడం ఆనందదాయకంగా భావిస్తున్నామని చెప్పారు. సామాజిక సమరసత వెల్లివిరిసెలా కవిత్వం రాసి ఆలాపించిన కవులకు, రచయితలకు సామాజిక సమరసతా వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆకుల నరేష్ బాబు అధ్వర్యంలో ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేసి శాలువా తో సత్కరించడం జరిగింది. ఈ కవి సమ్మేళనంలో కవులు కె.పవన్, ఎం.సిద్ధయ్య, కే.భాస్కర చారి, టి. కిషన్, తుమ్మ కృష్ణ, వి. సత్యనారాయ ణ పాల్గొని కవితా గానం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు హరిణ పవన్ సమన్వయ కర్తగా వ్యవహరించారు. సామాజిక సమరసత వేదిక గజ్వేల్ డివిజన్ అధ్యక్షుడు డా.మంద సాయినాథ్ రెడ్డి, కన్వీనర్ కాశమైన సందీప్ కుమార్, ఎర్రవాడ అరవింద్, వుప్పల మధుసూదన్ , చిలివేరి జనార్దన్, కడారి నరేంద్ర, ఏగొండ, చిలివేరి బలరాం తదితరులు పాల్గొన్నారు.

# లయోలా కళాశాలలో గాంధీ దివస్ వేడుకలు

**• గాంధీ జయంతి సందర్భంగా ఖాది, హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్ • చేతి వృత్తులు వారి జీవనోపాధికి భరోసా కల్పించాలి : వక్తలు**







ఆల్వాల్, మేజర్ న్యూస్ : లయోలా అకాడమీ, ఐ. క్యూ.ఎ. సి., కె. వి. ఐ సి., స్టూడెంట్స్ కౌన్సిల్., సంయుక్త ఆధ్వర్యంలో లో లయోలా కాకాశాలలో ప్రారంభమైన బాబు దివస్ వేడుకలు. సోమవారం ప్రారంభమైన ఐ వేడుకల్లో . హైదరాబాద్, సెప్టెంబర్ 30, 2024 లయోలా అకాడమీ–ఐ. క్యూ. ఎ. సి. స్టూడెంట్ కౌన్సిల్ , కె. వి. ఐ. సి., స్టేట్ ఆఫీస్, తెలంగాణా భాగస్వామ్యంతో, గాంధీ జయంతి సందర్భంగా సెప్టెంబర్ 30 నుండి అక్టోబర్ 2, 2024 వరకు బాపు దివస్ వేడుకలను లయోలా అకాడమీ ప్రాంగణంలో ప్రారంభించారు. సెప్టెంబర్ 30న లయోలా అకాడమీ క్యాంపస్లో ఖాదీ,హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్ తో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని మెట్పల్లి ఖాదీ సంస్థాన్ చైర్మన్ మాజీ ఎమ్మెల్యే కె. విద్యాసాగర్రావు, కెవిఐసి డైరెక్టర్ డాక్టర్ మనోజ్ లంక వారి బృఎందం మరియు లయోలా అకాడమీ యాజమాన్యం ప్రిన్సిపల్ ఫాదర్ డా. ఎన్.బి.బాబు, వైస్ ప్రిన్సిపల్స్ ఫాదర్ డా. జోసెఫ్, ఫాదర్ అరుల్ జోతి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ ఫాదర్ లూర్దు తోమస్ , డా.భవాని, డీన్ ఆఫ్ స్టూడెంట్స్ శ్రీమతి శరత్ చంద్ర ఇతర అద్యాపకుల చేతుల మీదుగా విద్యార్థుల సమక్షంలో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంబించారు.. ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ ఖాదీ ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు, స్థానిక ఖాదీ విక్రయదారులకు మద్దతునిచ్చి వారిని ప్రోత్సహించడానికి, తద్వారా మన గొప్ప సాంస్కృఎతిక వారసత్వాన్ని సంరక్షించడానికి మరియు చేతివృఎత్తుల వారి జీవనోపాధిని మెరుగుపరచడానికి ఈ ప్రదర్శన రూపొందించబడింది అని పేర్కొన్నారు. గాంధేయ విలువల పరిరక్షణకు దోహదపడే ఈ వేడుకల్లో చురుగ్గా పాల్గొనవలసిందిగా విద్యార్థులందరినీ, సిబ్బందినీ కార్యక్రమ నిర్వాహకులు ఆహ్వానించారు. మొదటి రోజు కార్యక్రమంలో కళాశాల ప్రాంగణంలో ఎగ్జిబిషన్తో పాటు, విద్యార్థులలోని సృఎజనాత్మకతను వెలికితీయడానికి వ్యాస రచన, పోస్టర్ మేకింగ్, కోల్లేజ్ క్రియేషన్ వంటి వివిధ పోటీలు నిర్వహించారు. కార్యక్రమాలలో రెండవరోజు అక్టోబర్ 1న, లయోలా అకాడమీ మ్యాజిక్ యూత్, ఎ. ఐ. సి. యు. ఎఫ్. ఆద్వర్యంలో ఉన్నత్ భారత్ అభియాన్ (యు. బీ. ఎ.) విభాగం కళాశాల దత్తత గ్రామాలకు చేరుకుంటుంది. ఈ ఔట్రీచ్ ప్రోగ్రామ్ పాఠశాల పిల్లలను వివిధ విభాగాలలో నైపుణ్యాల పట్ల విద్యార్థులని నిమగ్నం చేయడం, గ్రామ కమ్యూనిటీలలో స్వయం ప్రతిపత్తి యొక్క సూత్రాలను వివరించడం, గ్రామ సమస్యల పట్ల అవగాహన సమస్యలకు పరిష్కారాలు వెదికే దిశగా ప్రయత్నాలు ఈ ప్రోగ్రాం లక్ష్యంగా పెట్టుకుంది. అక్టోబరు 2న దత్తత గ్రామాల్లో గ్రామసభలను సందర్శించి వేడుకలకు ముగింపు పలకనున్నారు. ఈ సందర్శనలు స్వచ్ఛమైన, వ్యాధి రహిత గ్రామాలు, సహజ వనరుల స్థిరమైన వినియోగం, మహిళా సాధికారత, స్త్రీ శక్తి అక్షరాస్యత గురించి అవగాహన పెంచడంపై దృఎష్టి పెడతారు. చివరి రోజు ఈ కార్యక్రమం లయోలా అకాడమీ ఎన్ ఎస్ ఎస్. యూనిట్ ద్వారా నిర్వహించబడుతుందని నిర్వాహకులు తెలిపారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి కృషి : ఆస్కాని మారుతి సాగర్



నిజాంపేట్ మేజర్ న్యూస్ : జర్నలిస్టుల సంక్షేమమమే ధ్యేయంగా టియుడబ్ల్యూజేహెచ్ పని చేస్తుందని, జర్నలిస్టులపై పలుచోట్ల దాడులు జరుగుతున్నాయని వాటిని తెలంగాణ యూనియన్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం తీవ్రంగా ఖండిస్తుందని, ఈ విషయంలో ప్రభుత్వం చొరవ తీసుకొని అటాక్స్ కమిటీలను పునరుద్ధరించాలని టియుడబ్ల్యూజేహెచ్ –143 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్ కోరారు. సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ జర్నలిస్టుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ నగరంతో పాటు ఇతర జిల్లాల గ్రామీణ విలేకరుల ఇళ్ల స్థలాల విషయంలో ప్రభుత్వ స్పందించి విధాన పరమైన ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయంలో సంబంధిత శాఖ మంత్రి రాష్ట్రంలోని యూనియన్ నేతలతో సంప్రదింపులు జరిపి ఒక రోడ్ మ్యాప్ ను సిద్ధం చేసుకుని ముందుకు సాగితే బాగుంటుందని, అ దిశగా చర్యలు మొదలుపెట్టాలని కోరారు. ఇళ్ల స్థలాల విషయంలో స్వప్రయోజనాల కోసం కొందరు గందరగోళాన్ని సృఎష్టించి జర్నలిస్టులను అయోమయానికి గురి చేస్తున్నారని, ప్రభుత్వమే దీని విషయంలో స్పష్టత ఇచ్చినట్లయితే బాగుంటుందని సూచించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ జర్నలిస్టులకు దుండిగల్ లోనే ఇళ్ల స్థలాలను కేటాయించే దిశగా ప్రభుత్వంపై తెలంగాణ యూనియన్ వర్కింగ్ జర్నలిస్ట్ ఒత్తిడి తీసుకొస్తుందని ఈ సందర్భంగా ప్రకటించారు. స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెల్సీ నిధులతో సూరారంలోని ప్రెస్ క్లబ్ భవన నిర్మాణాన్ని త్వరలోనే పూర్తి చేసి జర్నలిస్టులకు అందుబాటులో తీసుకువస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు. కుత్బుల్లాపూర్ నియోజక టీయూడబ్ల్యూజే అధ్యక్షుడు సుధీర్ మంకాల అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మేడ్చల్ జిల్లా నాయకులు కొలిపాక వెంకట్, సుగ్రీవుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివాజీ, ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి సింగిరెడ్డి కృఎష్ణారెడ్డి, సీనియర్ జర్నలిస్టులో శ్రీనివాస్, నర్సింలు, పత్తి మాధవ్, శ్రీగిరి శ్రీనివాస్, ఎర్రోళ్ల బాబు, సురేష్ గౌడ్, శోభన్, కళ్యాణ్, బాన్స్వాడ వెంకటేష్, జుట్టు సాయి, అనంత రావు, క్రిష్ణ పంతులు, రవీందర్ రెడ్డి, రాజిరెడ్డి, గణేష్ రెడ్డి, ఉదయ్, రాజేశ్వర్, ప్రసాద్ ,తదితర జర్నలిస్ట్ లు పాల్గొన్నారు.

## సెల్‌ఫోన్– ఇంటి తాళాలను పగలగొట్టిన దొంగలను పట్టుకున్న నార్త్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు



సిటీబ్యూరో,మేజర్న్యూస్ః గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో టాస్క్‌ఫోర్స్,నార్త్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులుకల్సి తప్పించుకుని తిరుగుతున్న ఇద్దరు సెల్‌ఫోన్ దొంగలను,మరో ఇద్దరు తాళాలను పగులగొట్టి దొంగతనం చేసిన నిందితులను చాకచక్యంగా పట్టుకుని,వారివద్దనుంచి 19 సెల్‌ఫోన్లు,రెడ్‌మీ 13 ఫోన్లు,వైట్ కలర్ యాక్టివాకల్పి 1,25,000ల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ డి.సి.పి. వై.వి.ఎస్.సుధీంధ్ర తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.....సిరిగిరి కవిత (37),వంకుదోత్ ప్రసాద్ (28)వీరిద్దరు సెల్‌ఫోన్ దొంగలుకాగా, మహ్మద్ రఫీయుద్దీన్ (30),మహ్మద్ మోయిన్(26)లుకల్సి గత కొంత కాలంగా ఆర్టీసి బస్సులో ప్రయాణికుల జేబునుంచి సెల్‌పోన్లను తస్కరించగా,ఇంటి తాళాలను పగులగొట్టి దొంగతనాలకు పాల్పడుతూ తప్పించుకుని తిరుగుతున్నారు. విశ్వాసనీయమైన సమాచారం మేరకు తమ పోలీసులు గోపాలపురం పోలీసుల సహకారంతో నలుగురు నిందితులను చాకచక్యంగా అదుపులోకి తీసుకుని,వారివద్దనుంచి రూ.1,25,000ల విలువైన సోత్తును స్వాధీనం చేసుకుని విచారణ నిమిత్తం వారిని గోపాలపుంర పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు డి.సి.పి.తెలిపారు. ఈ దాడి కేసులో ఇన్‌స్పెక్టర్ కె. సైదులు,శ్రీనివాసులు దాసు, పి. జ్ఞానదీప్‌తోపాటు జోన్ పోలీసులు పాల్గొన్నారు.

## ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో గార్బ–దాండియా పోస్టర్‌ను ఆవిష్కరించిన గోవింద్‌రాఠి



అబిడ్స్ జోన్ ఇన్‌ఛార్జీ,మేజర్‌న్యూస్ః నాంపల్లి ఏగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏ.పి.ఏకానమిక్ కమిటీ,రాజస్థాని ప్రగతి సమాజ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఏగ్జిబిషన్ సోసైటీలో ప్రతి ఏటా దసరా సందర్భంగా అక్టోబరు,3వ తేదినుంచి రామాయణ్ మేళా ప్రారంభం అవుతుందని, అక్టోబరు,6వ తేదినుంచి 10వ తేదివరకు నిర్వహించే గార్భ–దాండియాను ఐదు రోజులపాటు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు మేళా చీఫ్ గోవింద్ రాఠి తెలిపారు. సోమవారం మధ్యాహ్నం ఏగ్జిబిషన్ గ్రౌండ్‌లో ప్రత్యేకంగా పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా మాదిరిగానే ఈసారికూడ పెద్ద ఏత్తున గార్భ,దాండియా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు,అందుకు ముంబాయిలోని కుంజ్ గుజరాతి గ్రూప్‌ద్వారా ప్రత్యేక సౌండ్ సిస్టమ్‌తో ప్రతి రోజు రాత్రి 8.00 గంటలనుంచి అర్ధరాత్రి 12.00 గంటలవరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గోవింద్ రాఠి, నిరంజన్,డి. సురేందర్‌రెడ్డి, జి.వి.,రంగారెడ్డి,నందగోపాల్ భట్టడ్,గిరిధరిలాల్ డాగా, డి. గంగాధర్‌రావు, డి. మోహన్, డా. ప్రభాశంకర్, డా. టి.ఎన్.వంశ తిలక్, మనోజ్ జైస్వాల్, సుమీత్ రాఠి తదితరులు పాల్గొన్నారు.

# అలరించిన అవధానం

**విద్యార్థులకు భగవద్గీత ప్రాముఖ్యత తెలియజేయాలి**

**గోగులపాటి కృష్ణమోహన్**



జీడిమెట్ల మేజర్ న్యూస్ : భావి తరాలకు సాహితీ పరిమళాలు అందించే ఉద్దేశంతో పాటు రేపటి భావిభారత పౌరులైన విద్యార్థిని విద్యార్థులకు భగవద్గీత ప్రాముఖ్యత తెలియజేయడం కోసం భగవద్గీత అవధానం ఏర్పాటు చేశామని కార్యక్రమ నిర్వాహకులు నా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గోగులపాటి కృఎష్ణమోహన్ పేర్కొన్నారు. సోమవారం నా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గోగులపాటి కృఎష్ణమోహన్ ఆధ్వర్యంలో, సత్ జ్ఞాన్ హై స్కూల్ కరస్పాండెంట్ చింతల మల్లేశం సహకారంతో కుత్బుల్లాపూర్ లోని సత్ జ్ఞాన్ హై స్కూల్ లో యువావధాని, ప్రవచన కర్త యెర్రంశెట్టి ఉమామహేశ్వరరావుచే భగవద్గీత అవధానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సమన్వయ కర్తగా బాధ్యతలు నిర్వహించిన నిర్వాహకులు గోగులపాటి కృఎష్ణమోహన్ మాట్లాడుతూ భావి తరాలకు సాహిత్యంలోని మాధుర్యం, భగవద్గీత ప్రాముఖ్యత తెలియజేసేందుకు తమ సంస్థ ద్వారా పలు కార్యక్రమాలు చేపడుతున్నామని ఇందులో భాగంగానే భగవద్గీత అవధానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేవలం ఇరువై రెండు సంవత్సరాల ప్రాయంలోనే యువ అవధానిగా, ప్రవచనకర్తగా రాణిస్తున్న ఉమామహేశ్వరరావు భవిష్యత్తులో శతావధానిగా ఎదగాలని ఆకాంక్షించారు. సత్ జ్ఞాన్ స్కూల్ కరస్పాండెంట్ చింతల మల్లేశం కార్యక్రమానికి అధ్యక్షత వహించి అవధానిని ఉద్దేశించి ప్రసంగించారు. ఇంత చిన్న వయసులోనే అద్భుత ప్రతిభను కనబరిచిన అతను భవిష్యత్తులో అత్యంత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు అందరూ అవధారణ మార్గదర్శకంగా తీసుకొని ఆధ్యాత్మిక చింతన పెంపొందించుకోవాలని కోరారు. పాఠశాల పిల్లలనే పృఎచ్ఛకులుగా (ప్రశ్నలు అడిగే వారిగా) పెట్టి ఈ కార్యక్రమం నిర్వహించడం పట్ల విద్యార్థులలో భగవద్గీత పట్ల ఎంతగానో ఆసక్తి ఏర్పడిందని స్కూల్ కరస్పాండెంట్ చింతల మల్లేశం అన్నారు. ఇలాంటి చక్కటి కార్యక్రమం ఏర్పాటుకు తమ పాఠశాలను ఎంపిక చేయడం ఆనందకరమైన విషయమని ఆయన అన్నారు. అవధానంలో పాలు పంచుకున్న అవధానికి, విద్యార్థిని విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా యువ అవధాని యెర్రంశెట్టి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు భగవద్గీతను ప్రతినిత్యం పఠించినట్లైతే తాము చదువుకుంటున్న విద్యలో కూడా మరింత రాణించగలుగుతారని పేర్కొన్నారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులు, నా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గోగులపాటి కృఎష్ణమోహన్ అవధాని యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు ను, స్కూల్ కరస్పాండెంట్ చింతల మల్లేశం ను ప్రశంసా పత్రాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృఎందం, విద్యార్థిని విద్యార్థులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రపంచ గుండె నివారణ దినోత్సవం సందర్భంగా భారీ ర్యాలీ..




హిమాయత్ నగర్ , మేజర్ న్యూస్ : నిత్యం వాకింగ్, పౌష్టికాహారం తో పాటు ఒత్తిడి లేని జీవితం గడపడం ద్వారా గుండె సంబంధిత సమస్యలకు దూరంగా ఉంచవచ్చని షాదన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ డీన్ మరియు ప్రొఫెసర్ ఫోరెన్సిక్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ బోయిని జగన్మోహన్ అన్నారు. నవ భారతి నిర్మాణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంబర్పేటలోని ప్రగతి విద్యా నికేతన్ హై స్కూల్ లో ప్రపంచ గుండె నివారణ దినోత్సవం పురస్కరించుకొని గుండె సంబంధిత వ్యాధులపై ఏర్పాటు చేసిన అవగాహన శిబిరంలో ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్డియో వెస్కులర్ వ్యాధుల కారణంగా ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా 20.5 మిలియన్లు మరణిస్తున్నారని అన్నారు. తరచూ ఆరోగ్య పరీక్షలు చేసుకోవడం ద్వారా గుండె జబ్బులను ముందుగానే గుర్తించి చికిత్స తీసుకోవడం ద్వారా జీవిత కాలాన్ని పొడిగించవచ్చని అన్నారు. ఎల్డీఎల్ కొలెస్ట్రాల్ పెరగకుండా చూసుకోవాలని సూచించారు. తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ మాట్లాడుతూ.. ఆరోగ్యంగా ఉండటానికి మంచి నిద్ర అవసరమని స్మోకింగ్, ఆల్కహాల్ కు దూరంగా ఉండాలని, నూనె పదార్థాలు, జంక్ ఫుడ్ కు దూరంగా ఉండి ప్రతినిత్యం కనీసం 300 క్యాలరీస్ ఖర్చు అయ్యేటట్టు వాకింగ్, వ్యాయామం చేయాలని ఉదాహరణలతో వివరించారు.లైన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320 బి డిస్ట్రిక్ట్ చైర్మన్ లయన్ ఆకుల రవీంద్రరావు మాట్లాడుతూ.. యువత అధికంగా గుండెపోటు బారిన పడుతున్నారని అన్నారు. రాష్ట్ర బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి గుండేపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు దాటిన యువత బిపి 80 120 దాటకూడదు అన్నారు. సంవత్సరానికి ఒక్కసారైనా యువత రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నవ భారతి నిర్మాణం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బత్తుల హేమంత్ ప్రసంగిస్తూ .. ఆరోగ్య సమస్యలపై చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. యువత డ్రగ్స్ కు, ధూమపానానికి, మత్తు పానీయులకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన వాతావరణం నిర్మించడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి మైనారిటీ మోర్చా మీడియా కన్వీనర్ డాక్టర్ ఎం హైసాక్ రాజ్ , లైన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ రాయల్ ప్రెసిడెంట్ లైన్ వాయిల శ్రీనివాసరావుస్కూల్ చైర్మన్ ఎస్. మధుసూధన్, ప్రిన్సిపాల్ స్నుధాకర్, శ్రీ భాస్కర్ తదితరులు పాల్గొని ప్రసంగించారు అంతకుముందు స్కూల్ విద్యార్థులు ప్లకార్డులు పట్టి భారీ ర్యాలీ నిర్వహించి గుండె సంబంధిత వ్యాధులపై ప్రజలను జాగృతి పరిచారు.

# ఇళ్ళలోని చెత్తను పారిశుధ్ధ్య కార్మికులకే ఇవ్వాలి : కార్పొరేటర్ శ్రవణ్ కుమార్





మల్కాజిగిరి, మేజర్ న్యూస్: ప్రజలు తమ ఇంటిలోని చెత్త ను బహిరంగ ప్రదేశాలలో వేయకుండా, విధిగా జీహెచ్ ఎంసీ ఏర్పాటు చేసిన పారిశుధ్య ఆటో కార్మికుడికి మాత్రమే ఇవ్వాలని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ వి.శ్రవణ్ కుమార్ సూచించారు. సోమవారం జీహెచ్ ఎంసీ ఆధ్వర్యంలో 140 మల్కాజిగిరి డివిజన్ కు చెందిన 6 గురు పారిశుధ్య సిబందికి అందచేసిన చెత్త తరలించు రిక్షాలు , పుష్ కార్ట్స్ కార్పొరేటర్ శ్రవణ్ కుమార్,
సర్కిల్ ఉప వైద్యాధికారిణి మంజులతో కలిసి పంపిణి చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లా డుతూ..మల్కాజిగిరి డివిజన్ పారిశుధ్యంలో ఆదర్శ%శీ%గా డివిజన్ గా మార్చుటకు అనేక కార్యక్రమాలు నిర్వ హించామని, ఇందులో భాగంగా మహాత్మా గాంధీ జయంతి వరకు "స్వచ్ఛ తా హీ సేవ" కార్యక్రమం ద్వారా బహిరంగా చెత్త వేయు ప్రాంతంలో రంగోలి వేయుట, ఆ ప్రాంతంలో స్వచ్ఛ ఆటో టిప్పర్ కు ఇంటిలోని చెత్త వేయని వారిని గుర్తించి వారిని ఆటోకు అనుసంధానం చేయుట, అవగాహనా కార్యక్రమం, ర్యాలీ, మానవహారం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డివిజన్ లోని ప్రజలు తమ ఇంటిలోని చెత్తను విధిగా ఆటో కార్మికులకు మాత్రమే అంది అందివ్వాలని కోరారు. బహిరంగ ప్రదేశాలలో చెత్త వేయరాదని, భయంకర వ్యాధులకు గురి కావద్దని, ఆసుపత్రులకు వెళ్ళి డబ్బులు వృధా చేసుకోరాదన్నారు. పారిశుధ్య కార్మికు లు విధులలో నిర్లక్ష్యం వహించరాదని,వర్షాలు అధికంగా వస్తున్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతం పారిశు ధ్యం చక్కగా ఉందని ఇంకా మెరుగు పరచా ల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మురికి వాడలలో ప్రత్యేక దృష్టి పెట్టాలని, అందుకు అదనపు సిబ్బంది అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్ వైజర్ చింత శ్రీనివాస్, అజయ్ శానిటరీ జవాన్, అంజయ్య, వసంత, బాలమణి, సంతోష, గిరి ఎస్ ఎఫ్ఏ లు, కార్మికులు పాల్గొన్నారు.

# జాన్ లాక్ ఇనిస్టిట్యూట్ గ్లోబల్ ఎస్సే ప్రైజ్‌లో.. శాంటా మారియా విద్యార్థుల అద్భుత ప్రతిభ

హైదరాబాద్, మేజర్ న్యూస్: శాంక్టా మారియా విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. జాన్ లాక్ ఇనిస్టిట్యూట్ గ్లోబల్ ఎస్సే ప్రైజ్‌లో రాణించారు. ప్రతిష్టాత్మక ఈ ఎస్సే ప్రైజ్లో నిషి, ఆన్య, రౌనక్ అనే ముగ్గురు విద్యార్థులు తమ ప్రతిభ చూపించారు. జాన్ లాక్ ఇనిస్టిట్యూట్ గ్లోబల్ ఎస్సే ప్రైజ్ అనేది విద్యార్థులను స్వతంత్ర ఆలోచన, విమర్శనాత్మక విశ్లేషణ, తార్కిక ఆలోచనలతో ముందుకు నడిపించడానికి ఉద్దేశించిన పోటీ. ఇది తత్వశాస్త్రం, రాజకీయం, ఆర్థిక శాస్త్రం, చరిత్ర, మానసిక శాస్త్రం, ధర్మశాస్త్రం, న్యాయశాస్త్రం వంటి అనేక విషయాలలో విద్యార్థులను రాయడానికి ఆహ్వానిస్తుంది. ఎస్సేలను ఆక్స్‌ఫర్డ్, ప్రిన్స్టన్ వంటి విశ్వవిద్యాలయాల సీనియర్ అకడమిక్‌లు పరిశీలిస్తారు. ప్రతి విభాగంలో విజేతలను ఎంపిక చేయడం జరుగుతుంది. ఉత్తమ ఎస్సేకు గ్రాండ్ ప్రైజ్ అందజేయనున్నారు. 15 ఏళ్లలోపు విద్యార్థులకు జూనియర్ కేటగిరీలో ప్రైజ్ కూడా ఇవ్వనున్నారు. శాంక్టా మారియా తరఫున నిషి జూనియర్ కేటగిరీలో ప్రతిభ చూపారు. ఆమె తన విషయంపై ఆలోచనలను స్పష్టంగానూ పరిశోధనాత్మకంగానూ వ్యక్తీకరించింది. ఆన్య, రౌనక్ ఇద్దరూ రాజకీయం విభాగంలో తమ విశ్లేషణా నైపుణ్యాలను, రాజకీయ ఆలోచనపై తమ ఆసక్తిని ప్రదర్శించి మెరిట్ పురస్కారాలు పొందారు. లండన్‌లోని గ్రోస్వెనర్ హౌస్ హోటల్‌లో జరిగిన ఈ అవార్డుల వేడుకలో దాదాపు రెండు వేల మంది హాజరయ్యారు. ఫైనలిస్టులు, వాళ్ల కుటుంబాలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో యూకే మాజీ ప్రధాన మంత్రి లిజ్ ట్రస్



మాట్లాడారు. విద్యార్థులను అభినందించారు.
ఈ సందర్భంగా శాంక్టా మారియా ప్రిన్సిపాల్ హేమా సంజయ్ మాట్లాడుతూ నిషి, ఆన్య, రౌనక్ అందించిన ఈ అసాధారణ విజయం పట్ల ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ విజయం వారి కృషి, ఆసక్తి, విమర్శనాత్మక ఆలోచనా శక్తికి నిదర్శనమన్నారు. విద్యార్థులలో ఈ లక్షణాలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఇది వారిలో మరింత ప్రేరణ కలిగిస్తుందని ఆశిస్తున్నామన్నారు. విజేతల ఎస్సేలను ఈ సంవత్సరం చివరలో ప్రచురించనున్నారని తెలిపారు. తద్వారా వారి ఆలోచనలను విశ్వవ్యాప్తం చేయనున్నారన్నారు.

# నష్ట పరిహారం, పక్కా ఇల్లు ఇవ్వాలి : లోక్ దళ్

హైదరాబాద్ /మేజర్ న్యూస్ : మూసి పరివాహక ప్రాంతల్లోని పేద ప్రజల పాలిట తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధీనం లో భీభ చ్ఛవం సృష్టిస్తున్న హై డ్రా. పేదల పాలిట కరోనగా మారిందని భారత జాతీయ లోక్ దళ్. పార్టీ. జాతీయ కార్యదర్శి, తెలంగాణ. అధ్యక్షులు. పుల్లూరు. వెంకట రాజేశ్వర్ రావు విమర్శించారు. కార్యాలయం లో ఏర్పపాటు చేసిన మీడియా సమావేశం లో పుల్లూరు మాట్లాడుతూ, పట్టాలు ఉన్న మూసీ పరివాహక ప్రాంతాల్లోని పెద నివాసితులకు ప్రత్యామ్నయం చూపించిన తర్వా వాతే అక్కడి నిర్మాణలను కూల్చాలని, పట్టా కలిగిన వారికి మార్కెట్ ధర ప్రకారం నష్ట పరిహారలు చెల్లించి. వారు చేసుకుంటున్న వ్యాపారలకు ఆర్థిక సహాయం ప్రశభుత్వం అందించి ఆదుకోవాలని పుల్లూరు డిమాండ్ చేశారు.

# సీఎంఆర్ఎఫ్‌ను పేదలు సద్వినియోగం చేసుకోవాలి

**మైనంపల్లి హన్మంతరావు మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే**



మల్కాజిగిరి, మేజర్ న్యూస్: అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద ప్రజలకు మెరుగైన వైద్య చికిత్స పొందటానికి సీఎం సహాయనిధి ఓ వరమని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు.గౌతం డివిజన్ చెందిన డి.రమేష్ గతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో ఆయన తన వైద్య చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయం కోసం సీఎంఆర్ఎఫ్ కు దరఖాస్తు చేసుకున్నారు. సీఎంఆర్ ఎఫ్ కింద రూ 48 వేలు మంజూ రైంది. సంబంధిత చెక్కును సోమవారం మైనంపల్లి హన్మంతరావు, లబ్ధిదారుడికి అందచేశారు.ఈ సందర్భంగా మైనంపల్లి హన్మంతరావు మాట్లాడుతూ..
నిరుపేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. పేదలకు కూడా కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సీఎంఆర్ఎఫ్ పథకం ద్వారా ప్రభుత్వం నుంచి తమ వంతు సహాయం అందచేస్తుందన్నారు. పేదరికంతో బాధపడుతూ అనారోగ్యాల బారిన పడుతున్న వారు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బీ బ్లాక్ అధ్యక్షుడు టి.వెంకటేష్ యాదవ్, పీవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమం కోసం పని చేస్తాం

**– టీయుడబ్ల్యూజే(ఐజెయు) రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి**

**- జర్నలిస్టు ఇండ్ల స్థలాల దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం**



ఎల్ బి నగర్, మేజర్ న్యూస్ : జర్నలిస్టుల సంక్షేమమమే ధ్యేయంగా టీయుడబ్ల్యూజే(ఐ జెయు) పని చేస్తుందని రాష్ట్ర కార్యదర్శి , రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గం కొత్తపేటలోని బాబు జగ్జీవన్ రామ్ భవన్ లో సోమవారం రంగారెడ్డి జిల్లా టియుడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షుడు కటకం సుభాష్ ఆధ్వర్యంలో వర్కింగ్ జర్నలిస్టుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జర్నలిస్టు ఇంటి స్థలాల దరఖాస్తు పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం గత పది సంవత్సరాలుగా యూనియన్ అనేక పోరాటాలు చేసిందని అన్నారు. ప్రస్తుతం ఇండ్ల స్థలాల కోసం చేపడుతున్నటువంటి విలేకరుల వివరాల సేకరణ అనంతరం నియోజకవర్గాల వారీగా లిస్టులను తయారుచేసి మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డికి అందజేస్తామని స్పష్టం చేశారు. ఆయన నుంచి ప్రభుత్వానికి నివేదిక అందజేసేందుకు రాష్ట్ర యూనియన్ నాయకులు కృషి చేస్తున్నారని తెలిపారు. సంఘాల కతీతంగా నియోజకవర్గంలో పనిచేస్తున్న అర్హులైన వర్కింగ్ జర్నలిస్టుల వివరాలను సేకరించాలని కోరారు. ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పినట్లు అసలు ఎవరు కొసరు ఎవరు అనేది తేల్చాల్సిన బాధ్యత మనపైనే ఉందన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే అర్హులైన జర్నలిస్టులను గుర్తించాలని విజ్ఞప్తి చేశారు.ఇంటి స్థలాలతో పాటు ఆరోగ్య భీమా కల్పన తదితర అంశాలపై పెద్ద ఏత్తున కసరత్తు జరుగుతుందని అన్నారు .త్వరలో జిల్లా కేంద్రంగా రాష్ట్ర స్థాయి పాత్రికేయుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి సీఎం రేవంత్ రెడ్డి మన సమస్యలు పరిష్కరించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని అన్నారు. ఆత్మీయ సమ్మేళనం విజయ వంతం చేయవలసిన బాధ్యత మన అందరి పైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి సంరెడ్డి శశి పాల్ రెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు అనంతుల శ్రీనివాస్, సోలిపురం రజనీకాంత్ రెడ్డి, వర్దెల్లి దశరథ, రచ్చ శేఖర్, శ్యాం ప్రసాద్, జంగయ్య, చెప్పల శ్రీనివాస్, మేకల రవీందర్ రెడ్డి, చెరుకు వెంకట్ స్వామి గౌడ్, మధు, రమేష్, శ్రీనివాసరావు, రాజు, మహేష్, రాజేంద్ర నగర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు దామోదర్ రెడ్డి, సూర్య నారాయణ, ప్రేమ్ ,చందు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# మా గ్రామంలో డంపింగ్ యార్డ్ వద్దే వద్దు

**ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి.
లేదంటే ఉద్యమం తప్పదు.
జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించిన లక్దారం గ్రామస్తులు.**



పటాన్ చెరు మేజర్ న్యూస్ బీ సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు మండలం లక్దారం గ్రామ పరిధిలో 100 ఎకరాల్లో ఏర్పాటు కానున్న డంపింగ్ యార్డ్ వ్యర్థాల శుద్ధి కర్మాగారం ను వెంటనే రద్దు చేసుకోవాలని డిమాండ్ చేస్తూ లక్దారం గ్రామస్తులు సోమవారం సంగారెడ్డి లోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ మా గ్రామ పరిధిలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. హైదరాబాద్ ప్రాంత జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ చుట్టుపక్క ప్రాంతాల్లో నివసించే అక్కడి స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు మాకు బాగా తెలుసు అని వారు అన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ లేకుండానే డంపింగ్ యార్డ వ్యర్ధాల శుద్ధి కర్మాగారాన్ని మా గ్రామ పరిధిలో ఎలా ఏర్పాటు చేస్తారని వారు ప్రశ్నించారు. గ్రామం మొత్తం ఏకమై ఉద్యమం చేయడానికి సిద్ధం కానీ ఏది ఏమైనా డంపింగ్ యార్డ్ ను మాత్రం మా గ్రామ పరిధిలో ఏర్పాటు కానివ్వం అని వారు హెచ్చరించారు. ఇప్పటికే మైనింగ్ వల్ల గ్రామం మొత్తం ఎప్పుడు దుమ్ము ధూళి తో ఉండడమే కాకుండా గ్రామస్తులు ఎప్పుడూ అనారోగ్యం పాలౌతున్నారని వారు ఆరోపించారు. అది చాలదన్నట్లు ఇప్పుడు డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసి మా గ్రామస్తుల ప్రాణాలతో చెలగాటమాడడం మంచి పద్ధతి కాదని వారన్నారు. లేదంటే తమకు ఎక్కడైనా శాశ్వత పునరావాసం కల్పిస్తే గ్రామాన్ని వదిలేసి వెళ్లిపోమంటే వెళ్ళిపోతామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో డంపింగ్ యార్డ్ కోసం స్థల సేకరణ విషయమై సర్వేలకు వచ్చే ప్రభుత్వ అధికారులను, సిబ్బందిని కచ్చితంగా అడ్డుకొని తీరతామని వారు అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ను కలిసిన వారిలో తాజా మాజీ ఎంపీటీసీ శైలజ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ మాసంగారి రామచంద్రారెడ్డి. మాసం గారి గోపాల్ రెడ్డి, దేవాదాయ కమిటీ చైర్మన్ గోపాల్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ మల్లేశం, మాజీ ఉపసర్పంచ్ చిన్నంగారి మల్లారెడ్డి దేవాదాయ కమిటీ మాజీ అధ్యక్షుడు తుంకి శంకర్ గౌడ్, ఆయకట్ట మాజీ చైర్మన్ రామ్ రెడ్డి, బిజెపి నాయకుడు కావలి వీరేశం తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులు 60 జిల్లా కలెక్టర్



సంగారెడ్డి మేజర్ న్యూస్ ప్రతినిధి. బీ జిల్లా స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తుల తో పాటు పెండింగ్ ధరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ఆదేశించారు.సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 60 దరఖాస్తులు అందాయని జిల్లా కలెక్టర్ తెలిపారు.ప్రజావాణి అనంతరం జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ప్రజావాణి దరఖాస్తులను స్వీకరిచడం తో పాటు, పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.వివిధ శాఖల పరిధిలో పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను వేగంగా పరిష్కారం చూపి,ఆన్లైన్లో అప్డేట్ చేయాలని అన్నారు.అలాగే ప్రత్యేక అధికారులు ప్రతి నెలా సమర్పించే ముందస్తు టూర్ డైరీలను సకాలంలో సమర్పించాలని సూచించారు. ఈ టూర్ డైరీ ప్రకారం ప్రతిరోజు మండల స్థాయిలో ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, సమస్యలను పరిశీలించి, పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గామాల్లో శానిటేషన్ సమస్యల పరిష్కారానికి, సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేకంగా దృష్టి సారించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామాల్లో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా పంచాయతీరాజ్ శాఖ ఏఈలు, జిపి సెక్రెటరీలు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు.ముఖ్యం గా కె జిబివి పాఠశాలలు, గురుకులాలు , సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలను పరిష్కరించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, అక్కడ చదువుకుంటున్న విద్యార్థుల మెనూ ప్రకారం భోజన వసతి కల్పించాలని, త్రాగునీటి సౌకర్యాలు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. వసతి గృహాల్లో త్రాగునీటి సమస్యను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ప్రజావాణి దరఖాస్తుల విషయానికి వస్తే, రెవెన్యూ శాఖ 30, దరఖాస్తులు, సర్వే ల్యాండ్ రికార్డు 5, పౌరసరఫరాల శాఖ 2, పంచాయతీరాజ్ %డ% పి టి విభాగం 7, పురపాలక శాఖ 5, జిల్లా సంక్షేమ శాఖ 4, విద్యాశాఖ 1, వ్యవసాయ శాఖ నుంచి 3, వైద్య ఆరోగ్య శాఖ 1, ఎక్సైజ్ శాఖ 2 , ధరఖాస్తులు అందాయని తెలిపారు తెలిపారు.అన్ని దరఖాస్తులను సత్వరమే పరిశీలించి, సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# కబ్జాకు గురైన కప్పలకుంట తేనెలకుంట



కొల్చారం మేజర్ న్యూస్.బీ మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన కప్పలకుంట తేనెల కుంట కబ్జాకు గురైంది ఈ విషయాన్ని ప్రజావాణిలో ఎమ్మార్వో కు ఫిర్యాదు చేసిన రాంపూర్ గ్రామ ప్రజలు సుమారు పది ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని కొల్చారం ఎమ్మార్వో కు ఫిర్యాదు చేశారు కొల్చారం మండలం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నాగుల గారి మల్లేశం మాట్లాడుతూ రాంపూర్ గ్రామంలోని పది ఎకరాల భూమి రాంపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సోముల యాదగిరి ఎం ఐ మిషిన్ల సహాయంతో భూమిని చదును చేసి కబ్జా చేయడం జరిగింది భూమిలో ఇంతకుముందు అధికారులు ప్రభుత్వ భూమి అని బోర్డు పెట్టిన ఆ బోర్డు ని తొలగించి అక్రమించుకోవడం జరిగింది ఆక్రమించుకున్న ప్రభుత్వ భూమి కుంటను ప్రభుత్వ భూమిపై తగు చర్యలు తీసుకోవాలని రాంపూర్ గ్రామ ప్రజలు కోరారు ఇదే కాకుండా మండలంలోని ఏ ప్రభుత్వ భూమి అయినా కబ్జాకు గురైతే హైడ్రా ను తీసుకువచ్చి ప్రభుత్వానికి అప్పగించి ప్రభుత్వ భూములకు రక్షణ కల్పిస్తామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు నాగుల మల్లేష్ రాంపూర్ గ్రామ ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# కలెక్టర్ కార్యాలయం ముందు విశ్వహిందూ పరిషత్ ధర్నా



సంగారెడ్డి మేజర్ న్యూస్. : తిరుమల కల్తీ లడ్డూను నిరసిస్తూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయం ముందు సోమవారం ధర్నా నిర్వహించారు. గోవిందస్వామి నామాలను జపించారు. అనంతరం కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా బజరంగ్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు సుభాష్ మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూలలో జంతువుల కొవ్వ వినియోగాన్ని ఖండించడం మరియు హిందూ దేవాలయాల స్వయంప్రతిపత్తి కోసం డిమాండ్ చేశారు తిరుమల తిరుపతి దేవస్థానంలో అందించే పవిత్ర లడ్డూ ప్రసాదంలో జంతు కొవ్వును నెయ్యిలో వినియోగిస్తున్నారంటూ ఇటీవల వచ్చిన ఆరోపణలపై విశ్వ హిందూ పరిషత్కు చెందిన కేంద్రీయ మార్గదర్శక మండలి సభ్యులు తీవ్రంగా బాధతో, ఆందోళన చెందుతూ ఈఘోర అవమానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నారు. ఇది హిందూ విశ్వాసానికి గాయం. ఈ క్రూరమైనచర్య ప్రపంచవ్యాప్తంగా లక్షలాది భక్తుల ధార్మిక మనోభావాలను ఉల్లంఘించడమే కాకుండా హిందువుల అత్యంత గౌరవప్రదమైన పుణ్యక్షేత్రాలలో ఒకటైన పవిత్రతను కూడా తీవ్రంగా దెబ్బతీస్తుంది. వి ఎచ్ పి కేంద్రీయ మార్గదర్శక మండలి ఈ సంఘటనను ఆలయ వ్యవహారాలలో ప్రభుత్వం జోక్యం చేసుకోవడం మరియు ఇతరమతాలకు చెందిన వ్యక్తులను ఆలయ నిర్వహణలో అధికార స్థానాలకు నియమించడం యొక్క ప్రత్యక్ష ఫలితం అనిఅభిప్రాయపడింది. ఇలాంటి చర్యలు హిందూ ధార్మిక సంస్థల స్వయంప్రతిపత్తిని హరించివేసి భక్తుల్లో అపనమ్మకాన్ని కలిగిస్తాయి. తిరుపతి దేవస్థానం లడ్డూలలో జంతు కొవ్వు వినియోగిస్తున్నారనే ఆరోపణలపై సమగ్ర, నిష్పక్షపాత న్యాయ విచారణ జరపాలని కోరుతున్నాం. రోజువారీ విచారణ ఆధారంగా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి. ఈ హేయమైన చర్యకు బాధ్యులైన దోషులను గుర్తించి, చట్టం యొక్క పూర్తి స్థాయిలో శిక్షించాలి, భవిష్యత్తులో ఇటువంటి నేరాలకు వ్యతిరేకంగా నిరోధకంగా పనిచేస్తుంది.రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే హిందూ దేవాలయాలపై తమ నియంత్రణను నిలిపివేయాలని మరియు హిందూ సమాజం తన స్వంత మతపరమైన సంస్థలను నిర్వహించడానికి అనుమతించాలని మేము డిమాండ్ చేస్తున్నాము. దేవాలయాలు మళ్లీ విశ్వాసం మరియు ఆధ్యాత్మికతకు కేంద్రాలుగా మారాలి. హిందూ సంప్రదాయాలను అర్థం చేసుకునే మరియు గౌరవించే అంకితభావం గల వ్యక్తులచే నిర్వహించబడాలి. దేవాలయాలు హిందూ సమాజంలోని అన్ని వర్గాల అవసరాలను తీర్చేలా చూసేందుకు, మేము ధార్మిక పరిషత్ బోర్డుల ఏర్పాటును ప్రతిపాదిస్తున్నాము, ఇది స్వతంత్రంగా దేవాలయాలు నిర్వహణను పర్యవేక్షించే విధంగా ఉంటుంది. ఈ బోర్డులు ఆలయ నిర్వహణకు ప్రజాస్వామ్య మరియు సమ్మిళిత విధానాన్ని నిర్ధారిస్తూ, సాధువులు, హిందూ సంస్థలు, పండితులు మరియు భక్తుల నుండి ప్రతినిధులతో కూడి ఉండాలి. వి ఎచ్ పి కేంద్రీయ మార్గదర్శక మండలి అన్ని హిందూ దేవాలయాల స్వచ్ఛత మరియు పవిత్రతను కాపాడటం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది. ఇకపై ఎలాంటి మతపరమైన పద్ధతులలొ లేదా ఆలయ వ్యవహారాల్లో జోక్యం చేసుకోకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని మేము కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతున్నాము. హిందూ భక్తుల హక్కులను పరిరక్షించడం మరియు వారి మత స్వేచ్ఛను సమర్థించడం చాలా అవసరం.వి ఎచ్ పి కేంద్రీయ మార్గదర్శక మండలి హిందూ దేవాలయాల పవిత్రతను పరిరక్షించడానికి మరియు వాటి స్వయంప్రతిపత్తిని నిర్ధారించడానికి తమ నిబద్ధతను పునరుద్ఘాటించారు. రాజ్యాంగం ద్వారా హామీ ఇవ్వబడిన మత స్వేచ్ఛను గౌరవించాలని మరియు హిందువులు వారి స్వంత మతపరమైన సంస్థలను నిర్వహించడానికి అనుమతించాలని మేము ప్రభుత్వాలను కోరుతున్నాము. అలా చేయడం ద్వారా, ప్రభుత్వాలు వివిధ వర్గాల మధ్య సామరస్యాన్ని, విశ్వాసాన్ని మరియు గౌరవాన్ని పెంపొందించగలవు మరియు రాష్ట్రాలు మరియు దేశం యొక్క మొత్తం శ్రేయస్సుకు దోహదం చేస్తాయిని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ దేశ్ పాండే పట్టణ అధ్యక్షులు ద్వారకా రవి రాజు గౌడ్ కసిని వాసు బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వేలిముద్రలు సేకరిస్తున్న కొల్చారం పోలీస్



కొల్చారం మేజర్ న్యూస్..: మెదక్ జిల్లా కొల్చారం మండలం పోలీస్ స్టేషన్ పరిధిలో కుల్చారం గ్రామంలోని మార్కెట్ పరిసరాల ప్రాంతంలో ప్రజల వేలి ముద్రలు సేకరిస్తున్న కుల్చారం పోలీసులు ఎస్సై ఆదేశాల మేరకు కొల్చారంలో వివిధ గ్రామాల నుంచి మార్కెట్ కు వస్తున్న జనాల వేలిముద్రలు సేకరిస్తున్న వైనం ఈ వేలిముద్రలు కొల్చారం మండలంలోని ప్రజల సెల్ ఫోన్ గాని ఇతర దొంగతనాలు గాని జరిగిన సమయంలో ఇటువంటి వేలిముద్ర సహాయంతో దొంగలను త్వరగా పట్టుకునే ప్రయత్నంలో వేలిముద్రలు సేకరించినట్టు వివరించారు